మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

Published from Jagitial
Circulated to Telangana

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 17-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 257 Issue: 257


17 మార్చి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:26 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి త్రయోదశి ఉ. 9:21 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం శతభిష ఉ. 6:01ం వరకు తరువాత పూర్వాభాద్ర యోగం సిద్ధ ఉ. 8:06 వరకు కరణం వనిజ ఉ. 9:21 వరకు విష్టి రా. 8:54 వరకు వర్జ్యం మ. 1:30 నుండి మ. 3:05 వరకు దుర్ముహూర్తం ఉ. 8:49 నుండి ఉ. 9:37 వరకు రా. 11:11 నుండి రా. 12:00 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:53 వరకు యమగండం ఉ. 9:25 నుండి ఉ. 10:55 వరకు గుళికాకాలం మ. 12:24 నుండి మ. 1:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:50 నుండి తె. 5:38 వరకు అమృత ఘడియలు రా. 11:00 నుండి రా. 12:35 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:00 నుండి మ. 12:48 వరకు



ఖతర్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ నౌక 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. ఈ నౌకలో సుమారు 40-46 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి. దీని రాకతో దేశంలో గ్యాస్ కొరత కొంతవరకు తీరనుంది. పోర్టులో గ్యాస్ అన్ లోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం మరో నౌక 'నందా దేవి' కూడా ఈ పోర్టుకు చేరుకోనున్నట్టు తెలుసుస్తోంది. ఇందులో 46వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ రానుంది. దీనికి సముద్ర మార్గాల్లో భారత నౌకాదళం భద్రతా ఏర్పాట్లు కల్పిస్తోంది.

# తెలంగాణ సాహిత్యానికి ఘనసత్కారం

## డాక్టర్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): తెలంగాణ కవి, ఉద్యమకారుడు, రచయిత నందిని సిధారెడ్డి కి అరుదైన గౌరవం లభించింది. కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీతో ఆయనను గౌరవించింది. కరోనా కాలంలో -2 వ పేజీలో...



6

# 'కోట'కు ఆస్కార్ నివాళి

**ఆస్కార్ విజేతల ప్రకటన**

**అట్టహాసంగా 98వ పండుగ**

**ఉత్తమ నటుడిగా జోర్డాన్**

ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను ఆస్కార్ వేదికపై స్మరించుకున్నారు. హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది.

# తగ్గేదేలే..!



## సంధి కోరం.. చర్చలకు రాబోం

**ఆత్మరక్షణ కోసం ఎంతకైనా రె'ఢీ'**

**శత్రువులతో యుద్ధాన్ని ముగిస్తాం**

**ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ**

"ఇరాన్ మిలటరీ స్థావరాలే లక్ష్యంగా అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా అంతేస్థాయిలో ప్రతి దాడి చేస్తోంది. డ్రోన్లు, మిస్సైళ్లతో తోటి గల్ఫ్ దేశాల్లోని యూఎస్, ఇజ్రాయెల్ స్థావరాలపై తమ ప్రతాపాన్ని చూపిస్తోంది. పనిలో పనిగా గల్ఫ్ దేశాల ఆయువు పట్టు ఆయిల్ రిఫైనరీలపైనా లక్ష్యాన్ని ఎక్కుపెడుతోంది. అయితే, కాల్పుల విరమణ చర్చలను ఇరాన్ కోరుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనగా, ఆ వాదనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తోసిపుచ్చారు."



టెహ్రాన్: అమెరికా దళాలకు ఆతిథ్యం ఇస్తున్న కొన్ని పొరుగు దేశాలు ఇరాన్‌పై దాడులను ప్రోత్సహిస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఆరోపించారు. ఇజ్రాయెల్ యునైటెడ్ స్టేట్స్ నిర్వహించిన ఉమ్మడి దాడుల్లో 200 మందికి పైగా పిల్లలతో సహా వందలాది మంది ఇరానియన్ పౌరులు మరణించారని ఆయన తెలిపారు. యుద్ధం ముగియాలి కాబట్టి శత్రువులు మళ్లీ అలాంటి దాడులకు ప్రయత్నించకూడదు, భవిష్యత్తులో తన ప్రత్యర్థులు ఇలాంటి దాడులకు ప్రయత్నించకుండా నిరోధించే తరువాయి 2 వ పేజీలో...



# వాన.. గాలి.. వడగండ్లు

## పలు చోట్ల గాలి దుమారం

**పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. పలు ప్రాంతాల్లో రాళ్ల వాన**

**రాష్ట్రంలో చల్లబడ్డ వాతావరణం.. కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్**

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన రాళ్ల వాన పడింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉరుములు మెరుపులతో రాళ్ల వాన పడింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. రాళ్ల వర్షం కురవడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడ్డారు. సిద్దిపేట తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,966 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,029 |

# కోడిగుడ్డు పగిలింది!

## సామేల్ ఇంటిపై బీజేవైఎం గుడ్లతో దాడి

**హిందూ ధర్మంపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**



బోడుప్పల్- హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): హిందూ ధర్మాన్ని, వేదాలను, బ్రహ్మణులను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ఇంటిని బీజేవైఎం కార్యకర్తలు ముట్టడించి కోడిగుడ్లతో దాడి చేశారు. బోడుప్పల్ లోని ఆయన నివాసంపై బీజేవైఎం కార్యకర్తులు కోడిగుడ్లతో దాడి చేసి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో దేవాలయాల్లో పొర్లు దండాలు పెట్టి, ఇప్పుడు హిందూ సమాజాన్ని అవమానించడం తగదని విమర్శించారు. మందుల సామేల్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 24 గంటల్లోగా సామేల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో దేవాలయాల్లో తరువాయి 2 వ పేజీలో...



# కాంగ్రెస్‌కు చిరిగింది!

**ఇంటి వద్ద ఫ్లెక్సీలు చించేసిన జీవన్ రెడ్డి**

**ఈ నెల 25న బీఆర్ఎస్‌లో చేరిక!**

**పలు దఫాలుగా కారు పెద్దలతో చర్చలు**

జగిత్యాల బ్యూరో, మార్చి 16 (ఈవార్తలు): గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి .. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానాలు ఎదురవుతున్నాయని -2 వ పేజీలో...

## విశ్వవాణి



దుబాయ్‌పై ఇరాన్ బాంబుల మోత మోగించడంతో అక్కడి ప్రజలు అన్నీ వదిలిపెట్టి వలసబాట పడుతున్నారు. తమ పెంపుడు జంతువులను కూడా వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో వేలాది మూగ జీవాలు రోడ్లమీదికి వస్తున్నాయని జంతు చారిటీ సంస్థలు పేర్కొంటున్నాయి.



# చిట్‌చాట్‌లు బంద్ జెయ్యిర్రి

**సభకు ప్రిపేర్ అయ్యి రావాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్**



# 31 వరకు అసెంబ్లీ సమావేశాలు

## బీఏసీ సమావేశంలో స్పీకర్ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు తరువాయి 2 వ పేజీలో...



# పెట్రో కొరత లేదు

## కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

న్యూఢిల్లీ: వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

17.3.2026

మేషం: ముఖ్యమైన పత్రాలు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులకు చేయవలసి వస్తుంది. ఆదాయం అంతంత మాత్రంగా ఉ ంటుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. ఉ ద్యోగాలు కొంత మందకొడిగా సాగుతాయి.

వృషభం: వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు.

మిధునం: స్త్రీ సంబంధ వ్యవహారాలలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారస్తులకు అధికారులతో వివాదాలు కలగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది. ఆదాయ మార్గాలు ఆశాజనకంగా ఉంటాయి.

కర్కాటకం: శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. మొండి బాకీలు వసూలు అవుతాయి. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉ ంటుంది. సమాజంలోకి కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ పనితీరుతో అధికారులను ఆకట్టుకొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం: దైవ సేవా కార్యక్రమాలకు ధన వ్యయం చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు మంచిది కాదు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయటం మంచిది. ఉద్యోగార్థులకు కొంత అనుకూలత వాతావరణం ఉంటుంది.

కన్య: దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. పని ఒత్తిడి అధికమై సమయానికి నిద్రహారాలు ఉండవు. ఇతరులకు డబ్బు ఇచ్చే విషయంలో కొంత ఆలోచించి ముందుకు సాగడం మంచిది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వ్యాపార విస్తరణకు తీసుకునే నిర్ణయాలు కొంత వ్యతిరేక ఫలితాలు ఇస్తాయి.

తుల: ఇంటా బయట మీ మాటకు విలువ తగ్గుతుంది. జీవిత భాగస్వామితో మాటపట్టింపులు ఉంటాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించక పోవడం మంచిది. సోదర స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యాపార వ్యవహారాలు కొంత నిదానంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

వృశ్చికం: వృధా ఖర్చులు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలించవు. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత మందకొడిగా సాగుతాయి.

ధనస్సు: నిరుద్యోగులకు అధికారుల అండదండలతో నూతన అవకాశాలు పొందుతారు. కుటుంబ సభ్యుల నుండి ఆశించిన సహాయ సహకారాలు అందుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉ ద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతన లాభాలు అందుతాయి.

మకరం: ధన పరంగా ఒడిదుడుకులు అదికమౌతాయి. దీర్ఘకాలిక రుణాలు ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి ఉ ద్యోగాలలో అధికారులతో సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన ఋణాలు చెయ్యకపోవడం మంచిది.

కుంభం: రాజకీయ వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. మిత్రుల నుండి ఆశించిన ధన సహాయం అందుతుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగమున ఆశించిన మార్పులు ఉంటాయి. కుటుంబ సమస్యలు రాజీ చేసుకుంటారు.

మీనం: ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు. వ్యాపారాల్లో నూతనప్రణాళికలు అమలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో శ్రమతో పనులు పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు వెళ్ళకపోవడం మంచిది. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది.

# చిట్‌చాట్‌లు బంద్ జెయ్యుర్రి

## సభకు ప్రిపేర్ అయ్యి రావాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు. ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.



# తగ్గేదేలే..!

**మొదటి పేజీ తరువాయి**

విధంగా యుద్ధాన్ని ముగిస్తామని అన్నారు. 'కాల్పుల విరమణకు వ్యతిరేకంగా టెహ్రాన్ వైఖరి అంటే అది యుద్ధాన్ని కోరుకుంటున్నట్లు కాదు, కానీ వివాదం నిర్ణయాత్మకంగా ముగియాలి. మేము కాల్పుల విరమణ కోరుకోవడం లేదని చెప్పడానికి కారణం యుద్ధాన్ని కోరుకుంటున్నాం అని కాదు. శత్రువులు మళ్లీ దాడులు చేయాలని అనుకోకుండా చేయాలన్నదే అసలు లక్ష్యం' అని వెల్లడించారు.

### యుద్ధంలో పాల్గొనకపోతే ఓకే

పశ్చిమాసియా యుద్ధంలో పాల్గొనని దేశాలకు ఇరాన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆయా దేశాలు హర్మూజ్ జలసంధిని వాడుకోవచ్చని మరోసారి స్పష్టం చేసింది. హర్మూజ్ మీదుగా నౌకల ప్రయాణానికి ఇరాన్ సైన్యం అనుమతి తీసుకోవాలని, సమన్వయం చేసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘై ప్రకటన చేశారు. 'ఇరాన్ సాయుధ దళాలు ఆ జలసంధిని నియంత్రిస్తున్నాయి. మాపై దాడి చేస్తున్న ఏ దేశ నౌకను అయినా హర్మూజ్ జలసంధి వినియోగించడానికి అనుమతించం. జాతీయ భద్రత రక్షణ కోసం హర్మూజ్ జలసంధిలో అవసరమైన చర్యలు తీసుకునే హక్కు ఇరాన్‌కు ఉంది. ఆ జలమార్గాన్ని దుర్వినియోగం చేస్తూ దాడి చేసేవారిని అడ్డుకోవడమే మా లక్ష్యం. జలసంధి ద్వారా సురక్షితంగా నౌకలు ప్రయాణించేందుకు ఎన్నో ఏళ్లుగా ఇరాన్ కృషి చేసింది' అని అన్నారు. దీంతో ఇరాన్ విధించిన ప్రత్యేక షరతులను పాటిస్తూ నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించొచ్చని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఇరాన్ పెట్టిన నియమాలు, పరిమితులను పాటించాల్సిందేనని చెప్పింది.

### యూఏఈలో డ్రోన్ల దాడులు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో ఫుజైనా ఆయిల్ పోర్టుపై ఇరాన్ మళ్లీ దాడి చేసింది. మిస్సైల్స్, డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. సోమవారం మధ్యాహ్నం జరిగిన దాడిలో.. ఫుజైరా పోర్టు నుంచి మంటలు భారీగా ఎగసిపడ్డాయి. పోర్టు బాగా దెబ్బతిన్నది. ఈ క్రమంలోనే పోర్టులో ఆయిల్ లోడింగ్ మొత్తం నిలిపివేసింది కంపెనీ. అంతకు ముందు, అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు.. ఇరాన్‌లోని పలు నగరాలపై బాంబులతో విరుచుకుపడ్డాయి. ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. యూఏఈ టార్గెట్‌గా మిస్సైల్స్, డ్రోన్లతో బీభత్సం చేసింది. ఆయిల్ కంపెనీలు, పోర్టులే లక్ష్యంగా ఈ దాడులు చేసింది. తాజా దాడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఫుజైరా ప్రాంతం నుంచి పెద్ద స్థాయిలో మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే పోర్టును మూసివేసింది యూఏఈ సర్కార్. ఆయిల్ లోడింగ్ బంద్ చేసింది.

### 7 వేల లక్ష్యాలు ఛేదించాం: ట్రంప్

ఇజ్రాయెల్ సాయంతో ఇరాన్ ముప్పును అంతం చేశాం: ట్రంప్

ఇప్పటి వరకు ఇరాన్‌లోని 7 వేలకు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తాము లక్ష్యంగా చేసుకున్న వాటిలో అధిక భాగం వాణిజ్య, సైనిక స్థావరాలే ఉన్నాయన్నారు. క్షిపణులు, డ్రోన్లు తయారు చేసే పరిశ్రమలపై దాడులు చేసినట్లు చెప్పారు. వారం వ్యవధిలో వందకుపైగా ఇరాన్ నౌకలు ధ్వంసం చేసినట్లు వివరించారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేన అంతమయ్యాయన్నారు. 'ఇరాన్ 47 ఏళ్లుగా ప్రపంచానికి ముప్పుగా తయారైంది. ఇజ్రాయెల్ సాయంతో ఇప్పుడు ఇరాన్ ముప్పును అంతం చేశాం. ఇంకా యుద్ధం అయితే ముగియలేదు. మేం ఇరాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాం. ఇప్పుడు ఆ దేశం మళ్లీ కోలుకోవాలంటే దాదాపు పదేళ్లు పడుతుంది. యుద్ధం ముగించేందుకు ఇరాన్ ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధమైనట్లుగా అనిపిస్తోంది. కానీ, ఆ దేశం తరపున మాట్లాడానికి ఎవరు ఉన్నారో తెలియట్లేదు. ఆ దేశ నేతలెవరో మాకు తెలియదు. ఇరాన్ లీడర్ మొజ్తాబా ఖమేనీ బతికి ఉన్నారో లేదో ఎవరూ స్పష్టంగా చెప్పట్లేదు' అని వెల్లడించారు.




# కాంగ్రెస్‌కు చిరిగింది!

**మొదటి పేజీ తరువాయి**

బహిరంగంగా మీడియా ముందే వెల్లడించారు కూడా. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి, కాంగ్రెస్ పార్టీలో చేరగా అప్పటి నుంచి జగిత్యాలలో వర్గపోరు మొదలైంది. అది కాస్తా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తారస్థాయికి చేరుకుంది. తమ వర్గం వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి.. తమ అనుచరులను ఇండిపెండెంట్లుగా పోటీ చేయించి.. గెలిపించుకుని తన సత్తా ఏంటో హైకమాండ్‌కు తెలియజేశారు. అయినప్పటికీ తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తన అనుచరులతో జీవన్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరనున్నట్లు తెలుస్తోంది. గత 4 దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన జీవన్‌రెడ్డి.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా గెలిచారు. అయితే డాక్టర్ సంజయ్ కుమార్ రాకతో కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యం లేనందునే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 25వ తేదీన జగిత్యాలలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి.. గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జగిత్యాలలో ఉన్న జీవన్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ ఫ్లెక్సీలను.. ఆయన అనుచరులు చించేయడం గమనార్హం. ఆయన నివాసం ముందు, లోపల ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండాలు, అగ్రనాయకుల ఫోటోలతో కూడిన బ్యానర్లను కార్యకర్తలు తీసేశారు. జీవన్ రెడ్డి మాత్రమే ఉన్న ఫోటోలు, ఫ్లెక్సీలను ఉంచుతున్నారు. తాను పార్టీకి ఎంత చేస్తున్నా దాన్ని అధిష్టానం గుర్తించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జీవన్ రెడ్డి.. ఇక కాంగ్రెస్ పార్టీతో బంధం తెంచుకోవడమే మేలు అని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో సుదీర్ఘంగా మంతనాలు జరిపిన తర్వాతే పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# వాన.. గాలి.. వడగండ్లు

**మొదటి పేజీ తరువాయి**

జిల్లా దుబ్బాక మండలం, మెదక్ జిల్లా నర్సాపూర్, శివ్వంపేటలో గాలి దుమారంతో కూడిన వర్షం పడింది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కాగా, ఆదిలాబాద్, హైదరాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, జిల్లాలలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 40 కి.మీ కంటే తక్కువ (గాలులలో) తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు ,30 నుండి 40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ,రంగారెడ్డి ,హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వర్ష సూచన చేసింది.

# తెలంగాణ సాహిత్యానికి ఘనసత్కారం

**మొదటి పేజీ తరువాయి**

నెలకొన్న పరిస్థితులను నందిని సిధారెడ్డి.. కళ్లకు కట్టినట్లు ఆయన 'అనిమేష' కవితా సంపుటికి ఈ పురస్కారం దక్కింది. కరోనా సమయంలో సామాజిక పరిస్థితులు, మానవీయ కోణాలను ఆయన తన కవితా సంపుటిలో చిత్రించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించిన వారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహంతోపాటు.. తామ్రపత్రం, శాలువాను కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సాహిత్య అకాడమీ ఛైర్మన్‌గా నందిని సిధారెడ్డి నియమితులయ్యారు. 1955లో మెదక్ జిల్లా బందారం గ్రామంలో నందిని సిధారెడ్డి జన్మించారు. ఆయన తండ్రి నర్రా బాలసిద్ధారెడ్డి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తిచేసిన నందిని సిధారెడ్డి.. 'ఆధునిక తెలుగు కవిత్వంలో సూర్యుడు' అనే అంశంపై 1981లో ఎంఫిల్ పట్టా అందుకున్నారు. ఆ తర్వాత 'ఆధునిక కవిత్వం, వాస్తవికత–అధివాస్తవికత' పై పరిశోధనలకు గానూ 1986 పీహెచ్‌డీ పట్టా పొందారు. నందిని సిధారెడ్డికి విద్యార్థి దశ నుంచే కవిత్వం, కథలు రాయడం అలవాటుగా మారింది. ఆ తర్వాత కాలంలో అనేక కవితా సంకలనాలు, వ్యాసాలను ప్రచురించారు. ఆయన 'మంజీర రచయితల సంఘం' వంటి సాహిత్య సంస్థలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2001లో తెలంగాణా రచయితల వేదికకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. తద్వారా తెలంగాణ సాహిత్యం, సంస్కృతిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు. 1997లో నందిని సిధారెడ్డి రచించిన 'నాగేటి సాల్లలో నా తెలంగాణ' అనే కవిత... మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో విశేష ప్రజాదరణ పొందింది. ఈ కవిత 'పోరు తెలంగాణ' చిత్రంలో పాటగా వచ్చింది. ఇక, జై బోలో తెలంగాణ వంటి చిత్రాలకు కూడా సిధారెడ్డి పాటలు రాశారు.

# కోడిగుడ్డు పగిలింది!

**మొదటి పేజీ తరువాయి**

పొర్లు దండాలు పెట్టి, ఇప్పుడు హిందూ సమాజాన్ని అవమానించడం తగదని మండిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు

# పెట్రో కొరత లేదు

**మొదటి పేజీ తరువాయి**

చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది. అటు.. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# 31 వరకు అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను రేపటికి(మంగళవారం) వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మంగళ, బుధవారాల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.




# హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితం

## సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించే దివ్యౌషధం.. సీహెచ్ఎస్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ చాందిని

## 14 ఏళ్లలోపు బాలికలు కచ్చితంగా తీసుకోవాలి.. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్

**పీఐబీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

హైదరాబాద్, మార్చి 16 (పీఐబీ): హెచ్‌పీవీ వ్యాక్సిన్ సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించే దివ్యౌషధం అని సెంటర్ హెల్త్ సర్వీసెస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చాందిని అన్నారు. వ్యాక్సిన్‌పై బాలికలు, విద్యార్థినుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో పత్రిక సమాచార కార్యాలయం-హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో 'వార్త' పేరిట సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ చాందిని.. హెచ్‌పీవీ వ్యాక్సిన్ పట్ల ఉన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేశారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, మహిళల్లో గర్భం, రుతుచక్రానికి సమస్యలు వస్తాయనే ప్రచారాలు అవాస్తవమని స్పష్టం చేశారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితమైనదని, సర్వైకల్ క్యాన్సర్‌ను 90 శాతం వరకు నివారిస్తుందని తెలిపారు. భారత్‌లో మహిళలకు ఎక్కువగా వస్తున్న క్యాన్సర్‌లలో సర్వైకల్ క్యాన్సర్ రెండోదని, హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో ఈ క్యాన్సర్‌ను నివారించవచ్చని చెప్పారు. ఈ వ్యాక్సిన్ పలు ఇతర రకాల క్యాన్సర్ల నివారణకు సైతం ఉపయోగపడుతుందని అన్నారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్(ఏడీజీ) శృతి పాటిల్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం 14 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తోందని, బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవాలని, తల్లిదండ్రులు, స్నేహితులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్(సీబీసీ) డిప్యూటీ డైరెక్టర్ కరీనా, అసిస్టెంట్ డైరెకర్లు శ్రీనివాసరావు, కోటేశ్వర రావు, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శివచరణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పీఐబీ, సీబీసీ సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మునిగిపోయే పడవ

**మాజీ మంత్రి మల్లారెడ్డి వెల్లడి**

**పార్టీ మారుతున్నట్టు ప్రచారంపై ఖండన**

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో వార్తల్లో నిలిచే మల్లారెడ్డి మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి మల్లారెడ్డి నేడు అసెంబ్లీ వద్ద క్లారిటీ ఇచ్చారు. "నా వయసు ప్రస్తుతం 73 ఏళ్లు. ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నాకు బాగా తెలుసు. మునిగిపోయే పడవలో ఎవరైనా ఎక్కుతారా? కాంగ్రెస్ పార్టీ ఒక మునిగిపోయే నావ లాంటిది. సీఎం రేవంత్ రెడ్డి 11 ఏళ్లు కాదు, 50 ఏళ్లు సీఎంగా ఉంటామన్నా ఆ పార్టీ మునిగిపోయే పడవే" అంటూ ఆ పార్టీలో చేరికను కొట్టిపారేశారు. ఇటీవల తన పెళ్లి రోజు వేడుకలకు ఆహ్వానించేందుకే రేవంత్ రెడ్డిని కలిశానని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆమె ప్రధాని మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను ప్రశంసించడంతో పాటు, హైదరాబాద్ పేరును 'భాగ్యనగర్'గా మార్చాలన్న బీజేపీ డిమాండ్‌ను సమర్థించారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కుటుంబం కాంగ్రెస్ వైపు కాకుండా బీజేపీ వైపు చూస్తోందా? అనే కొత్త చర్చ మొదలైంది. గతంలో ఆమె బీజేపీ అగ్రనేత బండి సంజయ్‌ను కలవడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

# అమెరికాలో గుండెపోటుతో వరంగల్ వాసి మృతి

వరంగల్, మార్చి 16 (ఈవార్తలు): ఉన్నత చదువులు చదివి, అమెరికాలో స్థిరపడ్డ ఓ తెలుగు యువ ఇంజినీర్ హఠాన్మరణం చెందాడు. వరంగల్‌కు చెందిన తాడిపత్రి రాకేశ్ (40) వర్జీనియా రాష్ట్రంలో గుండెపోటుతో మరణించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. కాగా, రాకేశ్ వరంగల్‌లోని ప్రముఖ వ్యాపారవేత్త జితేందర్ కుమారుడు. గత పదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా రాణిస్తూ అక్కడే స్థిరపడ్డాడు. 2014లో కరీంనగర్‌కు చెందిన తేజస్వినితో అతడికి వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఈ కుటుంబం వర్జీనియాలో నివాసముంటోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న రాకేశ్ చిన్న వయసులోనే గుండెపోటుతో కన్నుమూయడం అతడి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.




# హైదరాబాద్‌లో మారిపోయిన వాతావరణం

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీటిని తొలగించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి.

# ఫంక్షన్‌లో ఫొటో దిగుతుండగానే గుండెపోటు

**అక్కడికక్కడే కుప్పకూలిన మహిళ.. మృతి**

ఖమ్మం, మార్చి 16 (ఈవార్తలు): ఒక గృహ ప్రవేశ వేడుకకు హాజరైన ఓ మహిళ ఆ ఇంటి వారితో ఫొటో దిగుతూనే కుప్పకూలిపోయింది. ఈ విషాద సంఘటన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జరిగింది. ఖమ్మంలోని త్రీటౌన్ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల సుస్మిత తన బంధువుల గృహ ప్రవేశానికి వెళ్లింది. కుటుంబ సభ్యులతో ఫొటో దిగేందుకు వేదిక వద్దకు చేరుకుంది. వారికి శుభాకాంక్షలు చెప్పి, ఫొటో దిగుతుండగానే ఒక్కసారిగా వెనక్కి పడిపోయింది. పక్కన ఉన్న యువతి భుజంపై చేయి వేసి ఫొటో దిగుతుండగా ఈ ఘటన జరిగింది. పక్కనున్న వారు ఆమెను పట్టుకునే ప్రయత్నం చేశారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆమె కొన్ని రోజులుగా గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

# ప్రత్యూష కేసు.. లొంగిపోయిన సిద్ధార్థ రెడ్డి

నాంపల్లి-హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో 24 ఏళ్ల తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన సిద్ధార్థ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. సుప్రీం కోర్టు విధించిన నాలుగు వారాల గడువు ముగియడంతో, అమెరికా నుంచి నగరానికి వచ్చిన అతడు న్యాయస్థానం ముందు హాజరయ్యాడు. 2002 ఫిబ్రవరి 23న నటి ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి ఓ కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగారు. ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రత్యూష మృతి చెందింది. సిద్ధార్థ రెడ్డి మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. తన కుమార్తెది హత్యేనని ప్రత్యూష తల్లి ఆరోపిస్తూ దశాబ్దాలుగా న్యాయపోరాటం చేశారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు, ప్రత్యూషను ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై సిద్ధార్థ రెడ్డిని దోషిగా నిర్ధారించి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సిద్ధార్థ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశాడు. అయితే, ఐదేళ్ల శిక్షను హైకోర్టు రెండేళ్లకు తగ్గించింది. అయినప్పటికీ సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సిద్ధార్థరెడ్డి పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అతడు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది. పోలీసులు అతడిని చంచల్ గూడ జైలుకు తరలించారు.



# అసెంబ్లీలో బీజేపీ ఆఫీస్‌లోకి రాజాసింగ్

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అసెంబ్లీలోని బీజేఎల్పీ కార్యాలయానికి వెళ్లడం ఆసక్తిని రేకెత్తించింది. బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ (బీజేఎల్పీ) కార్యాలయానికి ఆయన వెళ్లడం, అక్కడి ఎమ్మెల్యేలతో గంటకు పైగా ముచ్చటించడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై రాజాసింగ్ తనదైన శైలిలో స్పందిస్తూ... "ఇది నా పాత ఇల్లు. వీరంతా నా పాత స్నేహితులు. ఎప్పుడైనా వస్తాను, ఎప్పుడైనా వెళతాను" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ఏ పార్టీలో చేరాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. తనను బీజేపీలో చేర్చుకోమని తాను బతిమిలాడుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. భవిష్యత్తులో ఎవరు ఎవరిని బతిమిలాడుతారో తేలుతుందని అన్నారు. ప్రస్తుతం తాను స్వేచ్ఛగా తిరుగుతూ మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నానని పేర్కొన్నారు. మరోవైపు, బీజేఎల్పీ కార్యాలయం వద్ద రాజాసింగ్ ఉన్న సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్కడకు రావడం ఇంకో ఆసక్తికర సన్నివేశానికి దారితీసింది. రాజాసింగ్‌ను చూడగానే కేటీఆర్ నవ్వుతూ... "సస్పెండ్ అయిన వ్యక్తివి బీజేఎల్పీ లోపలికి ఎలా వెళతావు? బయటకు రా" అని సరదాగా ఆటపట్టించారు. దీనికి స్పందనగా అక్కడే ఉన్న బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్.. "మీరు కూడా బీజేపీ ఛాంబర్‌లోకి రావాలి" అని కేటీఆర్‌ను ఆహ్వానించడం అసెంబ్లీ లాబీల్లో నవ్వులు పూయించింది.

# బాబుకు రేవంత్ దాసోహం

## తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు.. నదీ జలాలపై హరీశ్ తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని.. అయినా రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నాడని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాకు రేవంత్ రెడ్డి దాసోహమయ్యాడని.. ఏపీ, కేంద్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. ఢిల్లీ మీటింగ్ మినిట్స్ వచ్చి నెల దాటినా రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదు? అని ప్రశ్నించారు. మొద్దు నిద్ర వీడి నీటి హక్కులను కాపాడాలి.. లేఖల డ్రామాలు కట్టిపెట్టాలని కోరారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నదీ జలాల అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. నీటి హక్కుల సాధనలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆధారాలతో సహా ఎండగట్టారు. రేవంత్ రెడ్డి చేతకాని తనాన్ని సాక్ష్యాలు, ఆధారాలతో వివరించారు. చేతకాని, బాధ్యతలేని, ముందుచూపు లేని రేవంత్ రెడ్డి వైఖరితో కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మొద్దు నిద్రను వదిలించేందుకే బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తుందని ప్రకటించారు. 'ఉమ్మడి ఏపీలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో కేసీఆర్ నిరంతరం శ్రమించారు. కృష్ణా నదిలో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు కృష్ణా ట్రిబ్యునల్ సాధించి, నీటి పునఃపంపిణీ జరిగేలా చూశారు' అని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తుచేశారు. గోదావరి నదిలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణకు ఉన్న హక్కులను కేసీఆర్ గారు శాశ్వతంగా కాపాడారని చెప్పారు. గోదావరిలో నీటిలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను స్థిరపరచడానికి యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టులు కట్టి 400 టీఎంసీల ప్రాజెక్టులకు కేసీఆర్ అనుమతులు సాధించారు' అని మాజీ మంత్రి హరీశ్ రావు వివరించారు. 'ఇప్పుడు కేంద్రంలో ఉన్న బీజేపీ, ఏపీలోని టీడీపీ కూటమి ప్రభుత్వం కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయి. కృష్ణాలో నీటి దోపిడీ చేసిన ఏపీ ఇప్పుడు గోదావరి జలాలపై పడింది. ఇంత జరుగుతుంటే ఆదమరిచి నిద్రపోతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ చేతకానితనం ఏపీ ప్రభుత్వానికి ఆసరాగా మారింది' మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను హరించేందుకు ఏపీ పక్కా స్కెచ్ వేసింది. కేంద్రంలోని బీజేపీ అండ చూసుకుని గోదావరి నీళ్లను దోచుకునేందుకు టీడీపీ ప్లాన్ చేసింది. గోదావరిలో ఏ రాష్ట్రానికీ బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయలేదని ఏపీ వాదించడం దుర్మార్గం' అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదు? రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టారా? లేక దాసోహం అయ్యారా?' అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు. ఢిల్లీ మీటింగ్‌లో ఏపీ ప్రభుత్వం పోలవరం, నల్లమల్ల సాగర్ అంశాలను ఎజెండాలో పెట్టినా కూడా తెలంగాణ ప్రభుత్వం మీటింగ్‌లో కూర్చుంది. తెలంగాణకు ద్రోహం చేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను చైర్మన్‌గా చేసి రేవంత్ రెడ్డి దొంగ చేతికే తాళాలు ఇచ్చాడు' అని విమర్శించారు. ఏపీ ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ధిక్కరించడం అంటే రాజ్యాంగాన్ని ధిక్కరించడమే, తెలంగాణ హక్కులను కాలరాయడమేనని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. 'కృష్ణా నదిలో కనీసం 34 శాతం తాత్కాలిక వాటాను కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుకోలేకపోతోంది. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అక్కడి గవర్నర్ ప్రసంగిస్తూ.. నల్లమల్ల సాగర్ నుంచి నీళ్లు తీసుకెళ్లడానికి పనులు ముమ్మరం చేస్తున్నామని గర్వంగా చెప్పారు. మరి తెలంగాణ గవర్నర్ స్పీచ్‌లో.. నల్లమల్ల సాగర్‌ను అడ్డుకుంటామని, గోదావరిలో చుక్క నీటిని కూడా వదులుకోమని ఈ ప్రభుత్వం ఎందుకు చెప్పించలేకపోయింది' అని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు గతంలో చంద్రబాబు ఎన్ని కుట్రలు చేశారో.. ఎన్ని లేఖలు రాశారో రాష్ట్ర ప్రజలకు తెలుసు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి' అని బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.





# 60 వేల కోట్ల ఆస్తులు కాపాడాం

## హైడ్రా ద్వారా ప్రభుత్వ స్థలాలు భద్రం.. అసెంబ్లీలో తెలంగాణ గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రమించేతత్వం కలిగిన తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు అని ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజాకేంద్రీకృత పాలన ప్రభుత్వం విధానమని అన్నారు. విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్‌ను అనుసరిస్తున్నామని అన్నారు. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని గవర్నర్ తెలిపారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. జీహెచ్ఎంసీని ఇటీవల మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించినట్లు తెలిపారు. బయో ఆసియా సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.1,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా కొనసాగుతోందని అన్నారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఈ రంగంలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని అన్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో రూ.8,744 కోట్లు రైతు భరోసా కింద ఇచ్చామని వెల్లడించారు. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కొత్తగా తమ ప్రభుత్వం 15.12 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, 3.38 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని అన్నారు. స్వయం సహాయక బృందాలకు లక్ష కోట్ల రూపాయల రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈగల్ ప్రత్యేక సంస్థ ద్వారా డ్రగ్ సమస్యలను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నియామక బోర్డులను సంస్కరించినట్లు తెలిపారు. 67,763 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని గవర్నర్ తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాల్లో హామీలపై నిలదీస్తాం: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ.1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

# ప్రజాప్రతినిధులూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి: అనిరుధ్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌పై జరిగిన దాడి, అందులో ఆయనతో పాటు ఏపీకి చెందిన ఓ ఎంపీకి కూడా డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్‌గా తేలడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేడు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే మహమ్మారి మూలాలు ఎక్కువగా సినిమా పరిశ్రమలోనే కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అందుకే సినిమాల విడుదలకు ముందే నటీనటులందరికీ డ్రగ్స్ టెస్టులు నిర్వహించాలని, అందులో క్లీన్‌గా ఉంటేనే వారి సినిమాలను థియేటర్లలోకి అనుమతించాలని సంచలన ప్రతిపాదన చేశారు. కేవలం సినీ రంగమే కాదు, ప్రజాప్రతినిధులు కూడా సమాజానికి ఆదర్శంగా ఉండాలని... ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎమ్మెల్యేలు, తప్పనిసరిగా డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవడానికి నిరాకరించే ఏ ప్రజాప్రతినిధినైనా సరే అసెంబ్లీలోకి అడుగుపెట్టనివ్వకూడదని అన్నారు.

# 9.75 లక్షల కోట్లు రైటాఫ్

**11 ఏళ్లలో భారీగా రుణాల రద్దు**

న్యూఢిల్లీ: గత 11 ఏళ్లలో దేశీయ బ్యాంకులు రూ. 9.75 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం తెలిపారు. ఈ మేరకు పార్లమెంటులో మాట్లాడుతూ.. 2019-20 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.1.59 లక్షల కోట్ల విలువైన రుణాలను సాంకేతికంగా రద్దు చేయగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో తక్కువగా రూ.47,568 కోట్ల రుణాలను రైటాఫ్ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన కాలానికి సంబంధించి 2014-15లో రూ. 31,723 కోట్లు, 2015-16లో రూ. 40,416 కోట్లు, 2016-17లో రూ. 68,308 కోట్లు, 2017-18లో రూ. 99,132 కోట్లు, 2018-19లో లక్ష కోట్ల మార్కును దాటి రూ. 1.59 లక్షల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, 4 ఏళ్లు దాటిన మొండి బకాయిలను బ్యాంకులు రైటాఫ్ చేస్తాయి. అయితే, ఇది సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని, లోన్ తీసుకున్నవాళ్లు రుణాలను తిరిగి చెల్లించాల్సిందేనని సహాయ మంత్రి వివరించారు. రుణాల వసూలు ప్రక్రియను బ్యాంకులు కొనసాగిస్తాయని పేర్కొన్నారు.

# ఫోన్‌పే ఐపీఓ వాయిదా

ముంబై: ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తన పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) ప్రక్రియకు బ్రేకులు వేసింది. ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీకి అనుమతులు వచ్చాయి. భౌగోళిక రాజకీయ పరిణామాలు, స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఐపీఓ ప్రక్రియను వాయిదా వేశామని కంపెనీ సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. స్టాక్ మార్కెట్లలో స్థిరమైన ర్యాలీ వచ్చిన తర్వాత తిరిగి ఐపీఓ ప్రక్రియను కొనసాగిస్తామని, త్వరలో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంటుందని ఆశిస్తున్నట్టు సమీర్ చెప్పారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు త్వరగా శాంతించాలని ఆశిస్తున్నాం. యుద్ధ పరిస్థితుల వల్ల దేశీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉందన్నారు. దేశీయంగా అతిపెద్ద డిజిటల్ పేమెంట్ యాప్‌గా ఉన్న ఫోన్‌పే 2025 నాటికి 65 కోట్ల యూజర్లు, 4.7 కోట్ల మర్చంట్లతో ఆధిపత్యం కలిగి ఉంది. ఐపీఓ ద్వారా రూ. 10 వేల కోట్ల వరకు నిధుల సమీకరణకు కంపెనీ సిద్ధంగా ఉంది. దీనికి సెబీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# 4.9 శాతానికి నిరుద్యోగ రేటు

న్యూఢిల్లీ: పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు స్వల్పంగా దిగొచ్చింది. గణాంకాలు, పథక అమలు మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన కార్మిక సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి దేశంలో నిరుద్యోగ రేటు 4.9 శాతానికి తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 5 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం దిగిరావడమే ఇందుకు కారణం. సమీక్షించిన నెలలో పట్టణ నిరుద్యోగ రేటు 6.6 శాతానికి తగ్గింది. ఇది గతేడాది డిసెంబర్ నాటి స్థాయి అని పీఎల్ఎఫ్ఎస్ డేటా పేర్కొంది. ఇదే సమయంలో గ్రామీణ నిరుద్యోగం 4.2 శాతంతో స్థిరంగా కొనసాగుతోంది. మహిళల్లో కూడా నిరుద్యోగం 5.6 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గింది. ఈ క్షీణత గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ నమోదైంది. ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 39.7 శాతం నుంచి 40 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 25.5 శాతం వద్దే ఉంది.

# క్షేత్రస్థాయిలో వైసీపీ బలోపేతం: సజ్జల

తాడేపల్లి, మార్చి 16 (ఈవార్తలు): గత 15 ఏళ్లుగా వైసీపీ ప్రజల పక్షాన నిలబడిందని, ఇప్పుడు 16వ ఏడాదిలోకి అడుగుపెట్టిన తరుణంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగన్ హయాంలో జరిగిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని, అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. ముఖ్యంగా టీడీపీ సాగిస్తున్న తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని సజ్జల చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# రూ.23 కోట్లు అటాచ్

**రాయ్‌పూర్-విశాఖపట్నం భూ స్కాంలో ఈడీ చర్యలు**

వైజాగ్, మార్చి 16 (ఈవార్తలు): భారత్‌మాల పరియోజన కింద చేపట్టిన రాయ్‌పూర్-విశాఖపట్నం జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన భారీ భూసేకరణ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు తీసుకుంది. ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న రూ.23.35 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను అటాచ్ చేసినట్లు సోమవారం ప్రకటించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ ఆర్థిక నేరాల విభాగం/ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. దర్యాప్తులో భూమి బ్రోకర్లు, ప్రైవేట్ వ్యక్తులు, కొందరు ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు తేలింది. రహదారి నిర్మాణం కోసం భూసేకరణ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత, రెవెన్యూ రికార్డులను పాత తేదీలతో తారుమారు చేసి భూమిని చిన్న చిన్న భాగాలుగా విభజించినట్లు చూపించారు. తద్వారా భూమికి చెల్లించాల్సిన పరిహారాన్ని కృత్రిమంగా పెంచారు. ఈ కుట్రలో ప్రధాన నిందితుడైన హర్మీత్ సింగ్ ఖనుజా, అతని అనుచరులు రైతులతో మాట్లాడి, వారి నుంచి అఫిడవిట్లు, ఖాళీ చెక్కులు, ఇతర పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. అనంతరం రైతుల పేర్లతో కొత్త బ్యాంకు ఖాతాలు తెరిపించి, పెంచిన పరిహారం మొత్తాన్ని ఆ ఖాతాల్లో జమ చేశారు. తర్వాత, ముందే తీసుకున్న ఖాళీ చెక్కులను ఉపయోగించి, అదనపు పరిహారం మొత్తాన్ని తమ వ్యక్తిగత, అనుబంధ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. రైతులకు మాత్రం వాస్తవంగా రావలసిన పరిహారం లేదా కొద్దిగా ఎక్కువ మొత్తం ఇచ్చి మోసం చేశారు. ఈ పద్ధతిలో నిందితులు మొత్తం రూ.27.05 కోట్లు పక్కదారి పట్టించినట్లు దర్యాప్తులో తేలింది. ఇందులో రూ.23.35 కోట్ల మేర నిధులను గుర్తించి, వాటితో కూడబెట్టిన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసినట్లు ఈడీ తన ప్రకటనలో వివరించింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# అందరికీ ఒకటే రూల్స్

**'జన నాయగన్' చిత్రంపై పవన్**

విజయవాడ, మార్చి 16 (ఈవార్తలు): కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా సెన్సార్ వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. సెన్సార్ బోర్డు ఒక స్వతంత్ర సంస్థ అని, దాని నిర్ణయాల్లో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదంలోకి అనవసరంగా ఎన్డీయే ప్రభుత్వాన్ని లాగడం సరికాదని హితవు పలికారు. ఈ విషయంపై పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. నిబంధనలు అందరికీ ఒకేలా ఉంటాయని గుర్తుచేశారు. ఈ సందర్భంగా తన సొంత సినిమా 'ఓజీ' అనుభవాన్ని ఉదాహరణగా చెప్పారు. "నేను ఎన్డీయేలో భాగస్వామిని కాబట్టి 'ఓజీ'కి యూ/ఏ సర్టిఫికెట్ వస్తుందని మా దర్శకనిర్మాతలు భావించారు. కానీ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ వచ్చింది. దానిని నేను స్వాగతించాను. చిత్రంలో అంత హింస పెట్టుకుని యూ/ఏ ఎలా ఆశిస్తారని మా టీమ్‌నే ప్రశ్నించాను" అని పవన్ వివరించారు. 'జన నాయగన్' చిత్ర బృందం సెన్సార్ బోర్డు వద్ద సమస్యను సరిగ్గా పరిష్కరించుకోలేకపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం జనవరి 9న విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ సమస్యలతో చివరి నిమిషంలో వాయిదా పడింది. ఈ వివాదం మద్రాస్ హైకోర్టుకు చేరడంతో, సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీ మార్చి 17న (మంగళవారం) ఈ సినిమాను వీక్షించనుంది. కమిటీ నివేదిక తర్వాతే సినిమా విడుదలపై స్పష్టత రానుంది.



# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు బోగస్

**బీజేపీ సీనియర్ నేత కళ్లెం వాసుదేవరెడ్డి**

మల్యాల, మార్చి 16 (ఈవార్తలు): గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మించి మోసం చేసిందని, కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు పెద్ద బోగస్ అని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం వాసుదేవరెడ్డి ఘాటుగా విమర్శించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం బీజేపీ మల్యాల మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి, ఆర్ఐకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లయినా 6 గ్యారంటీలను అమలు చేయలేని దౌర్భాగ్య పరిస్థితిల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. రైతు భరోసాకు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు కూలీల రైతు భరోసాకు మంగళం పాడిందన్నారు. యువ వికాస పథకాన్ని గాలికి వదిలేసిందన్నారు. 5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు పత్తా లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, గతం అంజయ్య, సంకుర్తి తిరుపతి, గడ్డం నడి మల్లేశం, బోట్ల ప్రసాద్, కొల్లూరు గంగాధర్, సంగని రవి తదితరులు పాల్గొన్నారు.



# చెరువులో నీళ్లు నింపండి సారూ..!

**ప్రజావాణిలో మత్స్యకారుల విజ్ఞప్తి**

జగిత్యాల/మల్యాల, మార్చి 16 (ఈవార్తలు): చెరువులో నీళ్లు లేవు.. తూము కట్టినా పైప్ లైన్ లేదు.. ఉన్న ఆ చెరువులోనూ అక్రమ నిర్మాణాలు.. ఇదీ మల్యాల మత్తడి చెరువులో పరిస్థితి. అటు నీళు లేక, ఇటు చేపలను పెంచలేక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 200 మత్స్యకారుల కుటుంబాలకు ఈ చెరువే జీవనోపాధి. కానీ, పట్టించుకొనే నాథుడే లేడు. దీంతో విసిగి వేసారిన మత్స్యకారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్‌ను కలిసి చెరువులో నీళ్లు నింపాలని విన్నవించారు. పదేళ్ల క్రితం ముత్యంపేట వరద కెనాల్ వద్ద గత ప్రభుత్వం తూము నిర్మించిందని, కానీ, చెరువులోకి పైప్ లైన్ ఇవ్వకపోవడంతో వేసవిలో నీళ్లు లేక చెరువు ఎండిపోతోందని వెల్లడించారు. పైగా, చెరువు భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో.. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మనాల కిషన్, జిల్లా ఇంచార్జి దువ్వాక శివ మహారాజ్, జేఏసీ సభ్యుడు ఉపేంద్ర, మత్స్య సంఘం అధ్యక్షుడు కొండూరి భూమయ్య, మత్స్యసంఘం సభ్యులు బట్టు నవీన్, ప్రసాద్, నవీన్, లక్ష్మీరాజం, నర్సయ్య పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డితో కలిసి పనిచేసేందుకు రెడీ

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వెల్లడి**





జగిత్యాల, మార్చి 16 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీ నుంచి వెళ్లిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను ఎల్ రమణతో కలిసి పనిచేశానని, ఇప్పుడు జీవన్ రెడ్డితో కూడా కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎల్ రమణ వంటి వారికి మంత్రి పదవి ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డారు. అలాంటి తప్పిదాల వల్లనే బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాలేదని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరైనప్పటి నుంచి పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉంటున్నట్టు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తీరుపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి తక్కువ సీట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి ఎక్కువ టిక్కెట్లు కేటాయించారని ఆరోపించారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో సంజయ్ కుమార్ పైవిధంగా స్పందించారు.

# గుండెపోటు కథ సునీత సృష్టే


**అవినాశ్ రెడ్డి సంచలన ఆరోపణలు**



హైదరాబాద్, మార్చి 16 (ఈవార్తలు): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబుపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సునీత ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో అసలు విచారించాల్సిన కీలక అంశాలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విచారణను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసుకు సంబంధించి అనేక కీలక విషయాలను, తన వాదనలను ప్రజల ముందుంచారు. వివేకా హత్య జరిగిన తర్వాత 'గుండెపోటు' అనే కథనాన్ని తెరపైకి తెచ్చిందే సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, బాబాయ్ నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి అని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. 2019 మార్చి 16న సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్వయంగా గుండెపోటు అనే అనుమానాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తన తండ్రికి గతంలో స్టెంట్ వేశారని, ఆ కారణంగానే గుండెపోటుతో బాత్రూంలో పడి మరణించి ఉండొచ్చని ఆమె చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దీనికి బలం చేకూరుస్తూ, బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డికి కూడా శివప్రకాశ్ రెడ్డి ఫోన్ చేసి వివేకా గుండెపోటుతో చనిపోయారని చెప్పిన వీడియోను అవినాశ్ ప్రదర్శించారు. తానే గుండెపోటు కథ అల్లి, ఇప్పుడు ఆ నెపాన్ని తమపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. హత్య జరిగిన ప్రదేశంలో దొరికిన లేఖ అత్యంత కీలకమైన సాక్ష్యమని, ఆ విషయం తెలిసినా సునీత, ఆమె భర్త పోలీసులకు సమాచారం ఇవ్వలేదని అవినాశ్ ఆరోపించారు. పీఏ కృష్ణారెడ్డి ద్వారా లేఖ ఫొటోలు, డెడ్ బాడీ ఫొటోలు చూసినా, అది హత్య అని స్పష్టంగా తెలుస్తున్నా విషయాన్ని దాచిపెట్టడం సాక్ష్యాలను తారుమారు చేయడమేనని అన్నారు. 2020 జులై 28న సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో లేఖ గురించి తనకు తెలుసని అంగీకరించిన సునీత, సరిగ్గా నెల రోజుల తర్వాత ఆగస్టు 27న ఇచ్చిన మరో స్టేట్‌మెంట్‌లో తనకు ఏమీ గుర్తులేదని చెప్పడం విచారణను పక్కదారి పట్టించడమేనని విమర్శించారు. ఒకసారి ఇచ్చిన వాంగ్మూలాన్ని కప్పిపుచ్చుకోవడానికి సీబీఐ మరో వాంగ్మూలం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కేసులో ఎన్నో కీలకమైన అంశాలు ఉన్నప్పటికీ, వాటిపై సునీత ఎందుకు తదుపరి విచారణ కోరడం లేదని అవినాశ్ నిలదీశారు. "నిందితుడు దస్తగిరి తన వాంగ్మూలంలో, హత్యకు ముందు వివేకాను డాక్యుమెంట్ల కోసం తీవ్రంగా కొట్టామని, వాటిని తీసుకున్నాకే చంపామని చెప్పాడు. ఆ కీలకమైన డాక్యుమెంట్లు ఏవి? వాటిని రికవరీ చేయాలని సునీత ఎందుకు అడగడం లేదు? వివేకా రెండో భార్య షమీం, ఆమె కుమారుడు షహన్‌షాకు ఆస్తులు చెందకుండా ఉండేందుకు ఈ హత్య జరిగి ఉండవచ్చన్న కోణంలో ఎందుకు విచారణ జరపడం లేదు? వివేకా తన ఆస్తులను వారికి ఇవ్వాలనుకున్న విషయం విచారణలో స్పష్టమైంది. దీనివల్ల నష్టపోయేది ఎవరు? ఆ దిశగా దర్యాప్తు జరపాలని ఎందుకు కోరడం లేదు? దస్తగిరి తన స్టేట్‌మెంట్‌లో వివేకాకు ఉన్న అక్రమ సంబంధాల గురించి ప్రస్తావించాడు. ఆ నేపథ్యంలో కూడా హత్య జరిగి ఉండొచ్చు కదా? ఆ కోణంలో విచారణ జరపాలని ఎందుకు అడగడం లేదు? హత్య జరిగిన రోజు రాత్రి వివేకా ఇంటి వద్ద ఉండే అటెండర్ పండింటి రాజశేఖర్‌ను, సునీత తల్లి సౌభాగ్యమ్మ, భర్త రాజశేఖర్ రెడ్డి బలవంతంగా కానిపాకం పంపించారు. ప్రతిరోజూ ఉండే అటెండర్‌ను ఆ ఒక్కరోజే ఎందుకు పంపించాల్సి వచ్చింది? ఇది అనుమానాస్పదం కాదా?" అని అవినాశ్ ప్రశ్నించారు. హత్యలో తానే ఉన్నానని అంగీకరించిన అప్రూవర్ దస్తగిరి బెయిల్‌ను రద్దు చేయాలని తాము కోర్టుకు వెళితే, సునీత వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేసి, లూథ్రా వంటి సీనియర్ న్యాయవాదిని పెట్టి మరీ దస్తగిరి బెయిల్‌ను ఎందుకు కాపాడుతున్నారని అవినాశ్ ప్రశ్నించారు. ఇది వారి మధ్య ఉన్న కుమ్మక్కును బయటపెడుతోందన్నారు. ఢిల్లీలోని ఓ తెలుగు పెద్దమనిషి అండతో సీబీఐ డైరెక్టర్‌ను నియమించుకుని, చంద్రబాబుతో కలిసి సునీత ఈ కేసు విచారణను పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారని అవినాశ్ ఆరోపించారు. తాము చెప్పినట్టు వాంగ్మూలం ఇవ్వని సాక్షులను సీబీఐ విచారించలేదని, కేవలం ట్యూటర్ చేసిన సాక్షులతోనే స్టేట్‌మెంట్లు రికార్డు చేయించిందన్నారు. హిమకుంట్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని, "అవినాశ్ రెడ్డి గుండెపోటు అని చెప్పాడని నువ్వు చెప్పాలి" అని సునీత, ఆమె భర్త ఒత్తిడి చేశారని, కానీ ఆ వ్యక్తి అబద్ధం చెప్పడానికి నిరాకరించారని వివరించారు. రాబోయే ఎన్నికల వరకు ఈ కేసును రాజకీయంగా వాడుకోవాలనేది చంద్రబాబు, సునీతల ఉమ్మడి లక్ష్యమని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. కేసు విచారణలో అనవసర పిటిషన్లు వేస్తూ ట్రయల్‌ను ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడి దయ, చట్టం ముందు తాను నిర్దోషిగా నిరూపించుకుంటానని, నిజం ఏదో ఒక రోజు తప్పకుండా బయటకు వస్తుందని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

# నేటి రాజకీయాల్లో బాధ్యతలేమి

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**



న్యూఢిల్లీ: రాజకీయాల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల నాణ్యత, బాధ్యత కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రాలేకపోతున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునేటప్పుడు క్యారెక్టర్ (ప్రవర్తన), క్యాలిబర్ (సామర్థ్యం), కెపాసిటీ (పనితీరు), కాండక్ట్ (నడవడిక) అనే నాలుగు అంశాలను తప్పనిసరిగా చూడాలని ఆయన సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా విజయవాడ కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో నిన్న 'వినియోగదారుల అవగాహన, సాధికారత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. నేటి రాజకీయాల్లో కులం, మతం, ప్రాంతీయత వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగిపోయిందని విచారం వ్యక్తం చేశారు. రాజకీయం, విద్య, వైద్యం అనేవి వ్యాపారం కాదని, అవి ప్రజలకు సేవ చేసే మిషన్లు అని స్పష్టం చేశారు. కానీ నేడు విద్య, వైద్య రంగాలు పూర్తిగా వ్యాపారమయంగా మారిపోవడం బాధాకరమన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని, మాతృభాష కళ్లు లాంటిదైతే, ఆంగ్లం కళ్లజోడు వంటిదని ఆయన అభిప్రాయపడ్డారు. కళ్లు లేకుండా కళ్లజోడు వల్ల ఉపయోగం లేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ చీమలపాటి రవి, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం. రాజయ్య, సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




# పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ

అమరావతి, మార్చి 16 (ఈవార్తలు): ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి.. ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు ప్రారంభోత్సవాలు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో పొట్టి శ్రీరాములు 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇవాళ ఆవిష్కరించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేపట్టగా.. అందుకు గుర్తుగా.. 58 అడుగుల విగ్రహాన్ని తయారు చేయించారు. తొలి దశ పనులు పూర్తి కాగా.. రెండో దశలో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్‌గా నామకరణం చేశారు. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తుళ్లూరు సమీపంలోని శాఖమూరులో 6.8 ఎకరాల్లో నిర్మించిన ఈ స్మృతివనంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘాలు, ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఇక ఈ 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం.. 42 టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను ఉపయోగించారు. ఈ ప్రాజెక్టును చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. కేవలం 6 నెలల్లోనే మొదటి దశ పనులను పూర్తి చేయడం గమనార్హం. ఇక తొలి విడతలో పొట్టి శ్రీరాములు స్మృతివనం అభివృద్ధి చేసి కేవలం విగ్రహాన్ని నిర్మించడం మాత్రమే కాకుండా.. రెండో దశలో ఇంకొన్న వసతులు కల్పించనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగానే.. ఈ పొట్టి శ్రీరాములు స్మృతివనంలో అత్యాధునిక మ్యూజియంతోపాటు.. ఆడిటోరియం, యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాన్ని సాధించడం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ.. రాబోయే తరాలకు కూడా ఆయన ఆశయాలను చాటిచెప్పేలా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని.. సీఎం చంద్రబాబు కొనియాడారు. పొట్టి శ్రీరాములు గౌరవార్థం రాజధాని ఈ భారీ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించడం ఏపీ ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, నారాయణ, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, సవితలతో పాటు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు. బీజేపీ నేత మాధవ్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు.

# మమతపై సువేందు పోటీ



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా ప్రతిపక్ష నేత సువేందు అధికారి పోటీ చేయనున్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో పోటీ చేసే తమ అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. కోల్‌కతా నడిబొడ్డున ఉన్న భవానీపూర్ నియోజకవర్గం నుంచి సువేందు పోటీ చేయనున్నారు. 2011 నుంచి ఈ నియోజకవర్గంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తూ వస్తోంది. ఫస్ట్ లిస్ట్‌లో భాగంగా144 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. తొలి జాబితాలో కీలక నేత సువేందు అధికారితో పాటు పలువురి ప్రముఖులు పేర్లు ఉన్నాయి. నందిగ్రామ్‌తో పాటు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భబానీపూర్ స్థానం నుంచి సువేందు అధికారిని బరిలోకి దింపింది బీజేపీ. 2021 అసెంబ్లీ ఎన్నికలలో నందిగ్రామ్‌లో సువేందు అధికారి మమతా బెనర్జీని ఓడించిన విషయం తెలిసిందే. దీంతో మమతా బెనర్జీ భబానీపూర్ ఉప ఎన్నికలో పోటీ చేసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ సారి మమతాను ఢీకొట్టేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. నందిగ్రామ్‌తో పాటు మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తోన్న భబానీపూర్ నుంచి కూడా సువేందు అధికారిని పోటీకి దించి టీఎంసీకి సవాల్ విసిరింది. ఈసారి నందిగ్రామ్, భబానీపూర్ రెండు స్థానాల్లో మమతా బెనర్జీ ఎక్కడి నుంచి పోటీ చేసిన మరోసారి సువేందు అధికారి వర్సెస్ దీదీ మధ్య పోరు ఉండనుంది. సువేందు అధికారితో తలపడి గత పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంటారో లేక మరో నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ బరిలోకి దిగుతారో చూడాలి. అటు, కేరళ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ 47 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ నేమమ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. మరో కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్‌కు తొలి జాబితాలో చోటు దక్కింది. గత లోక్ సభ ఉప ఎన్నికలో వయనాడ్‌లో ప్రియాంక గాంధీపై పోటీ చేసిన నవ్య హరిదాస్ ఈసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు.




## 24 గంటల్లో గ్యారెంటీ డెలివరీ: పోస్టల్ శాఖ




న్యూఢిల్లీ: పార్శిళ్లు, ఇతర వస్తువుల డెలివరీలో వేగాన్ని పెంచేందుకు భారత తపాలా శాఖ (ఇండియా పోస్ట్) కీలక ముందడుగు వేసింది. '24 స్పీడ్ పోస్ట్' పేరుతో సరికొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసును మంగళవారం (మార్చి 17) ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దీని ద్వారా అత్యవసరమైన పార్శిళ్లను కేవలం 24 గంటల్లోనే గ్యారెంటీగా డెలివరీ అందించనుంది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొంటారు. తొలి దశలో ఈ '24 స్పీడ్ పోస్ట్' సేవలు దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్‌లలో అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలతో పాటు, మరుసటి రోజు డెలివరీ (ఐం1) అందించే '24 స్పీడ్ పోస్ట్', రెండు రోజుల్లో డెలివరీ (ఐం2) అందించే '48 స్పీడ్ పోస్ట్' సేవలను కూడా ప్రవేశపెడుతున్నారు. వీటికి ప్రత్యేక ప్రాసెసింగ్ విండోలు, విమానాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఈ కొత్త సేవల్లో ఓటీపీ ఆధారిత సురక్షిత డెలివరీ, ఎస్ఎంఎస్ అలర్ట్‌లతో కూడిన ఎండ్-టు-ఎండ్ ట్రాకింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. వ్యాపార వినియోగదారుల కోసం 'బై నౌ పే లేటర్' (డీపీూ) సదుపాయం, బల్క్ బుకింగ్స్‌పై ఉచిత పికప్, ఏపీఐ ఇంటిగ్రేషన్ వంటివి కూడా అందిస్తున్నట్లు కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఒకవేళ డెలివరీలో ఆలస్యం జరిగితే 'మనీ బ్యాక్ గ్యారెంటీ' కూడా ఇస్తామని, ఇది ఇండియా పోస్ట్ ప్రీమియం సేవలను మరింత బలోపేతం చేస్తుందని వివరించింది. దేశవ్యాప్తంగా పార్శిల్, ఈ-కామర్స్ రంగంలో సేవలను విస్తరించి, ఓ ప్రధాన లాజిస్టిక్స్ సంస్థగా మారేందుకు తపాలా శాఖ అనేక చర్యలు చేపడుతోందని ఈ నెల మొదట్లో మంత్రి పెమ్మసాని లోక్‌సభలో వెల్లడించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇప్పుడు ఈ నూతన సేవలను అందుబాటులోకి తెస్తున్నారు.

## ఎక్కువ సీట్లు కావాల్సిందే

**డీఎంకేపై మిత్రపక్షాల ఒత్తిడి**



చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌లో సీట్ల సర్దుబాటు వ్యవహారం సంక్లిష్టంగా మారింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, తమకు కేటాయించే సీట్ల సంఖ్యను పెంచాలని పలు మిత్రపక్షాలు గట్టిగా పట్టుబడుతుండటంతో చర్చలు కఠిన దశకు చేరుకున్నాయి. గతంలో కంటే కూటమి విస్తరించడం, క్షేత్రస్థాయిలో తమకు బలం పెరిగిందన్న కారణాలతో వామపక్షాలు, ఇతర చిన్న పార్టీలు తమ డిమాండ్లను డీఎంకే నాయకత్వం ముందు ఉంచాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో చెరో ఆరు స్థానాల్లో పోటీ చేసి రెండేసి సీట్లు గెలుచుకున్న సీపీఐ, సీపీఎం పార్టీలకు ఈసారి చెరో ఐదు సీట్లు ఇస్తామని డీఎంకే ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై వామపక్ష నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కనీసం గతంలో పోటీ చేసినన్ని సీట్లయినా కేటాయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఆ పార్టీల నేతలు వారాంతంలో అంతర్గత సమావేశాలు నిర్వహించి భవిష్యత్ వ్యూహంపై చర్చించారు. మరో మిత్రపక్షమైన తమిళగ వాల్వురిమై కట్చి (టీవీకే) సైతం సీట్ల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తమకు మళ్లీ ఒక్క సీటే కేటాయిస్తే డీఎంకేతో పొత్తును పునఃపరిశీలించుకోవాల్సి వస్తుందని ఆ పార్టీ అధినేత టి. వేల్‌మురుగన్ స్పష్టం చేశారు. "అదనపు సీట్లు కావాలని డిమాండ్ చేసినా డీఎంకే నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ పరిస్థితుల్లో ఒక్క సీటు కోసం కూటమిలో కొనసాగడంపై మా పార్టీ ఉన్నతస్థాయి కమిటీ పునరాలోచిస్తోంది," అని ఆయన విలేకరులతో అన్నారు. దీంతో పాటు పది డిమాండ్ల జాబితాను కూడా డీఎంకేకు సమర్పించామని ఆయన తెలిపారు. ఈ పరిణామాలపై తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై స్పందిస్తూ.. కూటమిలో కాంగ్రెస్ పార్టీ చేసిన సర్దుబాట్లను మిత్రపక్షాలు గుర్తించాలని సూచించారు. ఒకప్పుడు 100కు పైగా స్థానాల్లో పోటీ చేసిన తాము, కూటమి కోసం క్రమంగా సీట్ల సంఖ్యను తగ్గించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే, మరో మిత్రపక్షమైన విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) నేత థోల్ తిరుమావళవన్ మాత్రం డీఎంకేతో చర్చలు సాఫీగా సాగుతున్నాయని చెప్పడం గమనార్హం. 2021లో ఆరు సీట్లలో పోటీ చేసి నాలుగు గెలిచిన వీసీకేకు ఈసారి ఒకటి లేదా రెండు అదనపు స్థానాలు లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మిత్రపక్షాలతో చర్చలను ముమ్మరం చేసి, అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను ఖరారు చేయడం ద్వారా కూటమిని ఐక్యంగా ఉంచేందుకు డీఎంకే నాయకత్వం ప్రయత్నిస్తోంది.

## ఎక్స్ ఏఐలో అమన్ గొట్టుముక్కల

న్యూయార్క్: భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, స్టార్టప్ వ్యవస్థాపకుడు అమన్ గొట్టుముక్కల టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో కలిసి పనిచేయనున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధిని ఆటోమేట్ చేయడానికి రూపొందించిన ఆధునాతన ఏఐ (కృత్రిమ మేధ) వ్యవస్థలపై పనిచేయడానికి ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ సంస్థ 'ఎక్స్‌ఏఐ'లో చేరారు. అమన్ ఇటీవల తన బృందంతో కలిసి ఫైర్‌బెండర్ అనే ఏఐ కోడింగ్ అసిస్టెంట్‌ను ప్రారంభించారు. ప్రోగ్రామర్లు కోడ్‌ను మరింత సమర్థవంతంగా రాయడానికి ఇది సహాయపడుతుంది. ఎక్స్‌ఏఐ అడ్వాన్స్ కోడింగ్ ఏఐ సిస్టమ్స్ అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు తాను ఎలాన్ మస్క్‌కు చెందిన సంస్థలో చేరుతున్నానని అమన్ సామాజిక మాధ్యమ వేదికగా ప్రకటించారు. ఆధునాతన కోడింగ్ ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఎక్స్‌ఏఐ సరైన వేదిక అని ఆయన అభిప్రాయపడ్డారు. సూపర్ ఇంటెలిజెన్స్‌ను అందుకోవడానికి తాను చేస్తున్న కృషికి అవసరమైన కంప్యూటింగ్ శక్తిని ఈ సంస్థ అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలాన్ మస్క్ కూడా అతనిని ఎక్స్‌ఏఐలోకి ఆహ్వానించారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎక్స్‌ఏఐ మరియు స్పేస్ ఎక్స్‌తో కలిసి పనిచేస్తానని అమన్ గొట్టుముక్కల తెలిపారు. అమన్ గొట్టుముక్కల కుటుంబం దశాబ్దాల క్రితం భారత్ నుంచి అమెరికా వెళ్లింది. టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఫైర్‌బెండర్‌ను ప్రారంభించడానికి ముందు అమన్ పారాడిగ్మ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్□గా పనిచేశారు.



## ఆస్కార్ వేదికపై ప్రియాంక మెరుపులు

లాస్‌ఏంజిల్స్: ప్రపంచ సినీ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మరోసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హాలీవుడ్ నటుడు జేవియర్ బార్డెమ్‌తో కలిసి ఆమె 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' అవార్డును ప్రదానం చేసేందుకు వేదికపైకి వచ్చారు. ఈ సందర్భంగా నటుడు జేవియర్ బార్డెమ్ మైక్‌లో "ఫ్రీ పాలస్తీనా" అని గట్టిగా నినదించడం చర్చనీయాంశమైంది. అనంతరం వీరిద్దరూ కలిసి నార్వే చిత్రం 'సెంటిమెంటల్ వ్యాల్యూ'కు అవార్డును అందించారు. జోకిమ్ ట్రియర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఒక తండ్రికి, ఇద్దరు కుమార్తెల మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాల నేపథ్యంలో తెరకెక్కింది. ఈ వేడుక కోసం ప్రియాంక చోప్రా డియోర్ సంస్థ ప్రత్యేకంగా డిజైన్ చేసిన తెల్ల గౌనులో మెరిశారు. పాత హాలీవుడ్ శైలిని ప్రతిబింబించేలా ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె ఎంతో అందంగా కనిపించారు. వజ్రాలు, పచ్చలతో కూడిన నెక్లెస్, చెవిపోగులు ధరించారు. ప్రియాంక తన భర్త, పాప్ సింగర్ నిక్ జోనాస్‌తో కలిసి ఈ వేడుకకు హాజరయ్యారు. నిక్ క్లాసిక్ బ్లాక్ టక్సేడోలో కనిపించారు. లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ హోస్ట్ కోనన్ ఓ'బ్రియన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## వేలాది విమానాలు రద్దు: కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నాడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన లోక్‌సభలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సంక్షోభం వల్ల భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. "సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## స్టాలిన్ పాలనలో మహిళలకు భద్రత లేదు: నటి గౌతమి

చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే ప్రభుత్వంపై నటి, అన్నాడీఎంకే నేత గౌతమి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంలో రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని, వారు అభద్రతాభావంతో ఉన్నారని ఆమె ఆరోపించారు. కోయంబత్తూరులో అన్నాడీఎంకే నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జయలలిత హయాంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని గౌతమి గుర్తుచేశారు. ఆమె తన చివరి శ్వాస వరకు మహిళల సాధికారతకు కట్టుబడి ఉన్నారని, వారి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని తెలిపారు. కానీ, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం మాత్రం మహిళలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని విమర్శించారు. మహిళలకు భద్రత, గౌరవం కల్పించడంలో స్టాలిన్ సర్కార్ విఫలమైందని ఆమె దుయ్యబట్టారు. విలాతికులం అత్యాచారం, హత్య ఘటనపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించిన తీరును కూడా గౌతమి తప్పుబట్టారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాకే మాట్లాడతానని చెప్పడం బాధితురాలి కుటుంబం పట్ల సున్నితత్వం లేకుండా వ్యవహరించడమేనని అన్నారు.

## హరీశ్‌కు కన్నీటి వీడ్కోలు

**పదమూడేళ్ల నరకానికి తెర**

న్యూఢిల్లీ: పదమూడేళ్లుగా కోమాలో జీవచ్ఛవంలా ఉన్న హరీశ్ రాణాకు శాశ్వత విశ్రాంతిని ప్రసాదించే ప్రక్రియ మొదలైంది. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో, కారుణ్య మరణం కోసం అతడిని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు తరలించారు. కుటుంబ సభ్యులు గుండె రాయి చేసుకుని, కన్నీటితో అతడికి వీడ్కోలు పలికారు. 2013లో ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉన్న 19 ఏళ్ల హరీశ్ రాణా తాను నివాసముంటున్న భవనం నాలుగో అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి శాశ్వత అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ట్యూబుల ద్వారా ఆహారం, శ్వాస అందిస్తూ 13 ఏళ్లుగా అతడిని బతికించారు. కొడుకు కోలుకునే అవకాశం లేదని, అతడికి గౌరవప్రదమైన మరణాన్ని ప్రసాదించాలని తండ్రి అశోక్ రాణా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 11న కీలక తీర్పు వెలువరించింది. హరీశ్ కోలుకోవడం అసాధ్యమని వైద్య బృందాలు నిర్ధారించడంతో, అతడికి అందిస్తున్న కృత్రిమ జీవనాధారాన్ని తొలగించాలని ఆదేశించింది. ఇది మరణాన్ని ఎంచుకోవడం కాదని, కృత్రిమంగా జీవితాన్ని పొడిగించకుండా ఉండటమేనని కోర్టు వ్యాఖ్యానించింది. శనివారం ఘజియాబాద్‌లోని నివాసం నుంచి హరీశ్‌ను ఎయిమ్స్‌కు తరలించారు. అక్కడ పాలియేటివ్ కేర్ విభాగం వైద్యుల పర్యవేక్షణలో అతడికి అందిస్తున్న పోషకాలు, ద్రవాలను నెమ్మదిగా నిలిపివేసి, సహజంగా మరణించేలా ఏర్పాట్లు చేస్తారు. కోర్టు ఆదేశాలతో భారత్‌లో కారుణ్య మరణం అమలు కావడం ఇదే తొలిసారి. "ఒక తండ్రిగా ఇది చాలా బాధాకరం. ఏ తల్లిదండ్రులూ తమ కుమారుడిని ఈ స్థితిలో చూడాలనుకోరు" అని తండ్రి అశోక్ రాణా ఆవేదన వ్యక్తం చేశారు.

## సమాచారం లేకుండా ఇరాన్ దాటొద్దు

న్యూఢిల్లీ: ఎంబసీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఇరాన్ సరిహద్దును దాటి వేరే దేశాల మీదుగా స్వదేశానికి చేరుకోవాలనుకునే భారతీయులకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక సూచన చేసింది. తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా లేదా తమతో సమన్వయం చేసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో సరిహద్దు దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఇరాన్‌లోని భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, అవసరమైన చోట సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపింది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సరిహద్దు దాటడం సరికాదని సూచించింది. రాయబార కార్యాలయం సహకారం లేకుండా సరిహద్దుల ద్వారా ఇరాన్‌ను దాటి వెళ్లేందుకు ప్రయత్నిస్తే రవాణా, ఇమ్మిగ్రేషన్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హితవు పలికింది. ఒక్కసారి ఇరాన్‌ను దాటి మరో దేశం ద్వారా భారత్ చేరుకోవాలని ప్రయత్నించి, ఇతర దేశాల్లో చిక్కుకుపోతే సాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపింది. ఇరాన్‌లోని భారతీయులంతా తమ సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరింది.

## తైవాన్ వద్ద మళ్లీ చైనా దూకుడు

**భారీగా యుద్ధ విమానాలు, నౌకల మోహరింపు**

బీజింగ్: తైవాన్ జలసంధిలో గత రెండు వారాలకు పైగా కొనసాగిన అసాధారణ నిశ్శబ్దానికి తెరపడింది. చైనా తన సైనిక విమానాలు, నౌకలతో మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. గడిచిన 24 గంటల్లో తమ ద్వీపం చుట్టూ 26 చైనా సైనిక విమానాలు, 7 నౌకలు సంచరించినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం ఉదయం వెల్లడించింది. వీటిలో 16 విమానాలు తమ వాయు రక్షణ గుర్తింపు జోన్‌లోని ఉత్తర, మధ్య, నైరుతి ప్రాంతాల్లోకి ప్రవేశించాయని పేర్కొంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి మొదటి వారం వరకు తైవాన్ సమీపంలో చైనా సైనిక విమానాల కదలికలు దాదాపుగా నిలిచిపోయాయి. 2021 తర్వాత ఇంత ఎక్కువ కాలం పాటు చైనా విమానాల కార్యకలాపాలు ఆగడం ఇదే తొలిసారి. దీంతో చైనా తన వ్యూహాన్ని మార్చుకుందేమోనని, సైనిక శిక్షణ ప్రాధాన్యతలపై దృష్టి సారించి ఉండవచ్చని లేదా దౌత్యపరమైన చర్చల నేపథ్యంలో సంయమనం పాటిస్తుండవచ్చని విశ్లేషకులు భావించారు. అయితే, ఈ ఊహాగానాలకు తెరదించుతూ చైనా మళ్లీ తన దూకుడును ప్రదర్శించింది. తాజా పరిణామాల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. చైనా విమానాలు, నౌకల కదలికలను పర్యవేక్షించేందుకు తమ వాయు, నౌకా దళాలతో పాటు తీరప్రాంత క్షిపణి వ్యవస్థలను మోహరించినట్లు తెలిపింది. చైనా నుంచి కవ్వింపు చర్యలు మినహా ఎలాంటి దూకుడు చర్యలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో తైవాన్‌పై ఒత్తిడి పెంచే "గ్రే-జోన్" తంత్రంలో భాగంగా చైనా దాదాపు ప్రతిరోజూ తమ గగనతలంలోకి విమానాలను పంపుతోంది. రాజకీయంగా కీలకమైన సంఘటనల సమయంలో ఈ కార్యకలాపాల తీవ్రత మారుతూ ఉంటుంది. తమ నుంచి విడిపోయిన భూభాగంగా తైవాన్‌ను పరిగణించే చైనా, అవసరమైతే బలవంతంగానైనా విలీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రెండు వారాల పాటు సైనిక విన్యాసాలను ఎందుకు నిలిపివేసింది, ఇప్పుడు మళ్లీ ఎందుకు ప్రారంభించింది అనే దానిపై బీజింగ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## కలిసి వస్తారా.. నాటోకు బై చెప్తారా?

**నాటో దేశాలకు ట్రంప్ వార్నింగ్**

వాషింగ్టన్: పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి "చాలా దారుణంగా" ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. "అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే" అని ఆయన హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు  ట్రంప్ సమర్థించుకున్నారు. చమురు సరఫరాను అడ్డుకుంటే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, దానిని అడ్డుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడబోమని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలతో నాటో కూటమిలో ఒక్కసారిగా కలకలం రేగింది. పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా పాల్గొనడానికి యూరోపియన్ దేశాలు మొగ్గు చూపకపోవడంతో, అమెరికా, దాని మిత్రదేశాల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ మొదలైంది.

## యూఏఈలో 19 మంది భారతీయుల అరెస్ట్

దుబాయ్: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో మొత్తం 35 మందిని అరెస్ట్ చేయగా, వారిలో 19 మంది భారతీయులు ఉండటం గమనార్హం. వీరిని వేగవంతమైన విచారణ కోసం అధికారులు కోర్టుకు సిఫార్సు చేశారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు సంబంధించి ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా, దేశంలో అస్థిరత సృష్టించేలా ఫేక్ పోస్టులు పెట్టారని వీరిపై అభియోగాలు నమోదయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో సృష్టించిన నకిలీ వీడియో క్లిప్‌లు, క్షిపణి దాడుల వీడియోలకు భయానక వ్యాఖ్యానాలు జోడించి సర్క్యులేట్ చేశారని యూఏఈ అటార్నీ జనరల్ డాక్టర్ హమద్ సైఫ్ అల్ షమ్సీ వెల్లడించారు. మార్చి 14, 15 తేదీల్లో రెండు విడతలుగా ఈ అరెస్టులు జరిగాయి. నిందితులు మూడు బృందాలుగా విడిపోయి ఈ చర్యలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. కొందరు శత్రు దేశ సైనిక చర్యలను కీర్తిస్తూ పోస్టులు చేయగా, మరికొందరు పాత వీడియోలను ప్రస్తుత ఘటనలుగా చిత్రీకరించారు. యూఏఈ సైబర్‌క్రైమ్ చట్టం ప్రకారం ఇలాంటి తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తే కనీసం ఏడాది జైలు శిక్ష, లక్ష దిర్హామ్‌ల (దాదాపు రూ. 22 లక్షలు) జరిమానా విధించే అవకాశం ఉంది. సంక్షోభ సమయాల్లో తప్పుడు ప్రచారం చేస్తే శిక్ష, జరిమానా రెట్టింపు అవుతుంది. ఫిబ్రవరి చివరిలో అబుదాబిలోని భారత రాయబార కార్యాలయం ఇప్పటికే తమ పౌరులు వదంతులు వ్యాప్తి చేయవద్దని సూచనలు జారీ చేసింది.

## హార్ముజ్‌ను రక్షించడానికి వస్తాం.. కానీ!

**డొనాల్డ్ ట్రంప్‌కు చైనా షరతు**

బీజింగ్: హార్ముజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు ప్రపంచ దేశాలు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. హార్ముజ్ ప్రభావంతో ఇబ్బందిపడుతున్న చైనా సహా వివిధ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ట్రంప్ విజ్ఞప్తిపై స్పందించిన చైనా ఒక షరతు విధించింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న హార్ముజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు తాము ముందుకు వస్తామని, కానీ అంతకంటే ముందు పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని అమెరికాకు చైనా షరతు విధించింది. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలని అమెరికాకు సూచించారు. ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల చివరలో ట్రంప్ బీజింగ్ పర్యటనపై అమెరికాతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హార్ముజ్ ప్రాంతం మీదుగా అధిక ప్రయోజనాలు పొందుతున్న దేశం చైనాయేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ జలసంధిని రక్షించడానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. చైనా నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి తన బీజింగ్ పర్యటనపై నిర్ణయం ఉంటుందని అన్నారు. కాగా, ట్రంప్ పిలుపును జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు పట్టించుకోలేదు.

## ఖమేనీ విమానం పేల్చివేత

టెహ్రాన్: టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయంలో ఇరాన్ అగ్ర నాయకత్వం ఉపయోగించే ఒక కీలక విమానాన్ని ధ్వంసం, పలు సైనిక స్థావరాలను చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ దాడితో ఇరాన్, దాని మిత్రపక్షాల మధ్య సమన్వయం దెబ్బతింటుందని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిపినట్లు తెలిపింది. ఐడీఎఫ్ ప్రకటన ప్రకారం, ధ్వంసమైన విమానం ఎయిర్‌బస్ ఏ340. దీనిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, గతంలో సుప్రీం లీడర్ అలీ ఖమేనీ వంటి అగ్ర నాయకులు దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల కోసం ఉపయోగించేవారు. టెహ్రాన్‌లోని ఈ విమానాశ్రయంలో దేశీయ విమానాలతో పాటు ఇరాన్ వైమానిక దళానికి చెందిన సైనిక స్థావరాలు కూడా ఉన్నాయి.

వయ్యారి చిత్రం



మౌనీ రాయ్



## త్రిష-విజయ్‌కి 'డేట్' గోల!

ఏవైనా హఠాత్తుగా జరిగితే అవి యాదృచ్ఛికంగా జరిగినవా? లేక ఎవరైనా ప్లాన్ చేసినట్లా? అనే డౌట్ కలుగుతుంది. ప్రస్తుతం తమిళ స్టార్ హీరో విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని తేదీలు కూడా అచ్చం అలాంటి చర్చకే దారి తీస్తున్నాయి. విడాకుల కేసు విచారణ తేదీ, తమిళనాడు ఎన్నికలు, ఓట్ల లెక్కింపు రోజు, నటి త్రిష పుట్టినరోజు.. ఇలా కీలకమైన తేదీలు దగ్గరగా రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య విడాకుల కేసు విచారణ ఏప్రిల్ 20న జరగనుందని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. చాలా కాలంగా వీరిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని వార్తలు వినిపిస్తున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. అదే సమయంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. అదే రోజు త్రిష కృష్ణన్ పుట్టినరోజు కూడా కావడం సోషల్ మీడియాలో మరోసారి చర్చకు కారణమైంది. ఈ తేదీలన్నింటినీ చూసి కొందరు నెటిజన్లు ఇది కేవలం యాదృచ్ఛికమా? అని ప్రశ్నిస్తుండగా, మరికొందరు మాత్రం డేట్స్ టైమింగ్ పై ఇప్పుడు ఇంట్రెస్టింగ్ కామెంట్లు పెడుతున్నారు.

## ఆలియాకు ట్రోలింగ్ బాధ

గ్లోబల్ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న నటి.. ఆలియా భట్. బాలీవుడ్ నవతరం నటీమణుల్లో అత్యంత వేగంగా పరిశ్రమలో ఎదిగిన నటిగానూ ఆమెకు గుర్తింపు ఉంది. ఎంతో ప్రతిభావంతు రాలు కూడా. చిన్న వయసులో ఎంత మాత్రం ప్రయోగాలకు వెనుకాడకుండా పని చేస్తోంది. అయితే అమ్మడు ఎంతగా ఎదుగుతుందో, అంతకంతకు సోషల్ మీడియాలో సొగసరిపై ట్రోలింగ్ కూడా పెరుగుతోంది. తాజాగా బాఫ్టా వేడుకలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు , గతంలో తన భర్త రణబీర్ కపూర్ గురించి చెప్పిన విషయాలను నెటిజన్లు మరోసారి తెరపైకి తెస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. అలియా ఏం చేసినా, ఎలా మాట్లాడినా అందులో తప్పులు వెతకడమే పనిగా పెట్టుకున్న కొందరు నెటిజన్ల తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది.





## మోనాలిసా మైనర్.. ఆమె పెళ్లి చెల్లదు!

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేసిన 'వైరల్ గర్ల్' మోనాలీసా భోంస్లే పెళ్లి ఇప్పుడు పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఒక ముస్లిం వ్యక్తిని ఆమె వివాహం చేసుకోవడం కేవలం వ్యక్తిగతం కాదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందంటూ దర్శకుడు సనోజ్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా 'లవ్ జిహాద్' అని ఆరోపిస్తూ ఏకంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాననడం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. ఆదివారం ఖర్గోన్‌లో మోనాలీసా కుటుంబాన్ని కలిసిన ఆయన, ఈ పెళ్లి వెనుక మతమార్పిడి కోణం ఉందని ఆరోపించారు.

# 'కోట'కు ఆస్కార్ నివాళి

## ఆస్కార్ విజేతల ప్రకటన
## అట్టహాసంగా 98వ పండుగ
## ఉత్తమ నటుడిగా జోర్డాన్





యావత్ సినీ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన ఆస్కార్ అవార్డుల విజేతలను సోమవారం ప్రకటించారు. ఈ **98**వ ఆస్కార్ పండగకు లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా నిలిచింది. ఈ వేడుకకు హాలీవుడ్ కమెడియన్ కోనన్ ఓబ్రియన్ వ్యాఖ్యాతగా వ్యవహ రించారు. ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ పురస్కారాన్ని ప్రియాంక చోప్రా అందజేశారు. 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్', 'సిన్నర్స్' సినిమాలకు అవార్డుల పంట పండింది. 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రం ఆరు విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలు దక్కించుకుంది. ఉత్తమ నటుడిగా నిలిచిన మైఖేల్ బీ జోర్డాన్ ర్యాన్ కూగ్లర్ దర్శకత్వంలో వహించిన సిన్నర్స్ చిత్రంలో ద్విపాత్రాభినయంలో కనిపించారు. ఒకే చిత్రంలో కవలలుగా నటించి ఆస్కార్ గెలుచుకున్న తొలి నటుడిగా ఆయన అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. అలాగే, ఈ విభాగంలో ఆస్కార్ అందుకున్న ఆరో నల్లజాతీయుడిగా నిలిచారు. బుల్లితెరపై కెరీర్ ప్రారంభించిన జోర్డాన్ వెండి తెరపై ఆస్కార్ అవార్డుతో ప్రతిభ చాటుకున్నారు. మార్వెల్ చిత్రం 'బ్లాక్ పాంథర్'లో జోర్డాన్ పోషించిన 'కిల్‌మాంగర్' పాత్ర హాలీవుడ్ చరిత్ర లోనే అత్యుత్తమ విలన్ పాత్రలలో ఒకటిగా నిలిచి పోయింది. సామాజిక సందేశాన్నిచ్చే చిత్రాల్లో నటిస్తూ.. వైవిధ్యమైన పాత్రలు పోషించడం ఆయన స్పెషల్. హీరోగానే కాకుండా.. పాత్ర నచ్చితే ఏ క్యారెక్టర్ అయినా చేస్తారు. హీరోగా బిజీ ఉన్న సమయంలోనే విలన్‌గా నటించారు. నటుడిగానే కాకుండా దర్శకుడిగాను రాణించారు.




### తండ్రీ కూతుళ్ల బంధానికే ఉత్తమ చిత్రం

ఈ వేడుకల్లో ఆరు 'ఆస్కార్'లు అందుకున్న 'వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్' చిత్రం తండ్రీ కూతుళ్ల భావోద్వేగంతో నిండిపోతుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను ఎంతో హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. సొంతబిడ్డగా పెంచుకున్న చార్లీన్‌ను కాపాడేందుకు తండ్రి ఏం చేస్తాడు? ఆ పోరాటంలో అతని ఆలోచనలు, సంబంధాలు, నైతిక విలువలు ఎలా మారతాయి? స్వార్థం తన పరిస్థితులను ఎలా మార్చేసింది? తల్లి మీద కోపం, పెంచిన తండ్రి మీద అనుమానంతో ఎటూ తేల్చుకునే స్థితిలో ఉన్న చార్లీన్ నమ్మకాన్ని ప్యాట్ ఎలా గెలుచుకోగలిగాడు? అన్నదే ఈ చిత్ర కథ. 2000 నాటి 'వైన్‌లాండ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. గతేడాది సెప్టెంబరు 26న వార్నర్ బ్రదర్స్ నిర్మాణ సంస్థ ఈ సినిమాను విడుదల చేసింది. 130-175 మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో తీసిన ఈ మూవీ.. ప్రపంచవ్యాప్తంగా 209.6 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురిపించకపోయినా.. అండర్సన్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. అటు విమర్శకుల ప్రశంసలతో పాటు అనేక పురస్కారాలు సాధించింది. 31వ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్సులో 3, గోల్డెన్ గ్లోబ్ అవార్డుల్లో నాలుగు, బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డుల్లో ఆరు విభాగాల్లో గెలుపొందింది.

### ఏడోసారీ 'టై' అవార్డు

ఈ వేడుకల్లో ఆసక్తికర ఘటన ఒకటి చోటు చేసుకుంది. 'ఒకే కేటగిరీకి' ఇద్దరు విజేతలుగా నిలిచారు. ఈ జాబితా టై అయింద'ని చెప్పడంతో.. డాల్బీ థియేటర్ చప్పట్లతో మారు మోగింది. 98 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో ఏడోసారి ఈ అరుదైన 'టై' చోటుచేసుకుంది. బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో విజేతలకు నటుడు కుమాయిల్ నంజియాని అవార్డును అందించారు. ఈ అవార్డుకు 'ది సింగర్స్', 'టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా' చిత్రాలు ఎంపికయ్యాయి.

### ఆస్కార్ విజేతలు వీరే..

**ఉత్తమ చిత్రం :** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ దర్శకుడు :** పాల్ థామస్ అండర్సన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
**ఉత్తమ నటుడు :** మైఖేల్ బి జోర్డాన్ (సిన్నర్స్)
**ఉత్తమ నటి :** జెస్సీ బక్లీ (హామ్నెట్)
**ఉత్తమ సహాయ నటుడు :** సీన్ పెన్ (వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
**ఉత్తమ సహాయ నటి :** ఎమీ మాడిగన్ (వెపన్స్)
**ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ :** కేపాప్ డిమాన్ హంటర్స్
**ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ :** ది గర్ల్ హు క్రైడ్ పెరల్స్
**ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ :** ఫ్రాంకెన్‌స్టైయిన్
**ఉత్తమ మేకప్ అండ్ హెయిర్ స్టైలింగ్ :** ఫ్రాంకెన్‌స్టైయిన్
**ఉత్తమ క్యాస్టింగ్ :** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ :** ది సింగర్స్, టూ పీపుల్ ఎక్స్ఛేంజ్ సలైవా
**ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** సిన్నర్స్
**ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ :** మిస్టర్ నోబడీ ఎగైనెస్ట్ పుతిన్
**ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ :** ఆల్ ది ఎంప్టీ రూమ్స్
**ఉత్తమ సౌండ్ :** ఎఫ్ 1
**ఉత్తమ ఎడిటింగ్ :** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ సినిమాటోగ్రఫీ :** సిన్నర్స్
**ఉత్తమ విజువల్ ఎఫెక్ట్ :** అవతార్ ఫైర్ అండ్ యాష్
**ఉత్తమ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ :** సెంటిమెంటల్ వ్యాల్యూ (నార్వే)
**ఉత్తమ ఒరిజినల్ సాంగ్ :** గోల్డెన్ (కేపాప్ డిమాన్ హంటర్స్)
**ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే :** వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
**ఉత్తమ ఒరిజినల్ స్కోర్ :** సిన్నర్స్
**ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ :** ఫ్రాంకెన్‌స్టైయిన్



# గేల్ రికార్డ్ బద్దలు కొడుతా



యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉన్న అరుదైన ఐపీఎల్ రికార్డును బద్దలు కొడుతానని టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ అన్నాడు. ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ రికార్డ్ క్రిస్ గేల్ పేరిట ఉంది. అతను ఐపీఎల్ 2013 సీజన్‌లో పుణె వారియర్స్ ఇండియాపై ఆర్‌సీబీ తరఫున 66 బంతుల్లో 175 పరుగులు చేశాడు. గత 13 ఏళ్లుగా ఈ రికార్డు చెక్కు చెదరకుండా ఉంది. అయితే ఈ రికార్డును అధిగమించడమే తన లక్ష్యమని వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. న్యూఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన బీసీసీఐ నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో వైభవ్ ఈ విషయాన్ని వెల్లడించాడు. హోస్ట్ హర్ష భోగ్లే.. వైభవ్‌కు మూడు ఆప్షన్స్ ఇచ్చాడు. ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు, ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేయడం, క్రిస్ గేల్ 175 పరుగుల రికార్డును అధిగమించడం.. వీటిల్లో ఏది టార్గెట్? అని అడిగారు. దానికి వైభవ్ స్పందిస్తూ.. 'క్రిస్ గేల్ చేసిన 175 రన్స్ రికార్డును అధిగమించడం'అని బదులిచ్చాడు.రాజస్థాన్ రాయల్స్ కప్ అందించడం కూడా తన లక్ష్యమని వైభవ్ వెల్లడించాడు. అయితే తాను ఎప్పుడూ గేమ్ పైనే ఫోకస్ చేస్తానని, బయట జరిగే చర్చ గురించి ఆలోచించనని స్పష్టం చేశాడు. 'నేనేం చేయగలనో దానిపై దృష్టి పెడతా. మైదానంలో బాగా ఆడితే ఆటోమేటిక్‌గా మనపై అందరి అటెన్షన్ ఉంటుంది. ఒకవేళ సరిగ్గా ఆడకపోయినా ఏవో మాటలు అంటారు. కానీ, నేనెప్పుడూ వాటిని పట్టించుకోను. నా ఆట పైనే ఫోకస్ చేస్తా. తొలిసారి నేను అండర్ 19 ప్రపంచకప్ ఆడా. ఫైనల్లో సెంచరీ చేయడం గర్వంగా ఉంది. జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో నావంతు భాగస్వామ్యం అందించగలిగాను. అలాగే రాజస్థాన్ రాయల్స్‌కు కప్ అందించాలి. ఈ ఏడాది నా లక్ష్యాల్లో అదొకటి. అంకితభావంతో పనిచేస్తే సక్సెస్ వస్తుందని నమ్ముతా'అని వైభవ్ తెలిపాడు.



# భారతీయుల ప్రాణాలతో ఆటలా?

## సన్ రైజర్స్‌పై సునీల్ గవాస్కర్ ఫైర్!



పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ యాజమాన్యంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. సన్‌రైజర్స్ చెల్లించే డబ్బులు భారతీయుల ప్రాణాలు తీస్తాయని మండిపడ్డాడు.ఇంగ్లండ్ వేదికగా జరిగే ది హండ్రెడ్ లీగ్ కోసం సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్ అహ్మద్‌ను రూ.2.32 కోట్లకు కొనుగోలు చేసింది. హండ్రెడ్ లీగ్ వేలంలో సన్‌రైజర్స్ ఓనర్ కావ్యమారన్ పాల్గొంది. ఆమె స్వయంగా అబ్రార్ అహ్మద్‌కు బిడ్ వేసింది. అయితే పాక్ ఆటగాడిని కొనుగోలు చేయడంపై భారత అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బాయ్‌కట్ చేయాలని పిలుపునిచ్చారు. సన్‌రైజర్స్ లీడ్స్ అధికారిక ఖాతా తాత్కలికంగా సస్పెండ్ అయ్యేలా రిపోర్ట్స్ కొట్టారు. సన్‌రైజర్స్ లీడ్స్‌లో సన్‌నెట్ వర్క్ వాటా 51 శాతం ఉండగా. మిగతా 49 శాతం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ నిర్ణయాన్ని తప్పుబట్టిన సునీల్ గవాస్కర్..ఓ ప్రతికకు రాసిన కాలమ్‌లో ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'ఒక భారతీయ యజమానికి చెందిన ఫ్రాంచైజీ పాకిస్తాన్ ఆటగాడిని కొనుగోలు చేయడంపై వచ్చిన ఆగ్రహం సరైందే. 2000 ముంబై దాడుల తర్వాత పాకిస్థాన్ క్రికెటర్లను ఐపీఎల్ నుంచి తొలగించారు. ఆ దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌లు కూడా ఆడటం లేదు. 2019 పహల్గాం అటాక్ తర్వాత ఇరు దేశాల మధ్య పరిస్థితి పూర్తిగా చెడిపోయింది. పాకిస్థాన్ ఆటగాళ్లకు చెల్లించే డబ్బు వారి ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయంగా మారుతుంది. ఆ డబ్బు ద్వారా ఆయుధాల కొనుగోలు చేసే అవకాశం ఉంది. అది పరోక్షంగా భారత సైనికులు, పౌరుల ప్రాణనష్టానికి దారి తీస్తుంది. ఇది భారతీయ సంస్థ అయినా.. విదేశీ అనుబంధ సంస్థ అయినా యజమాని భారతీయుడే. అయితే ఆ డబ్బు పరోక్షంగా భారతీయుల ప్రాణ నష్టానికి దారితీస్తుంది. ఒక టోర్నీ గెలవడం భారతీయుల ప్రాణాల కంటే ముఖ్యమా?'అని గవాస్కర్ సన్‌రైజర్స్‌ను ప్రశ్నించాడు. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను విడుదల చేయాలని కేకేఆర్‌ను బీసీసీఐ ఆదేశించిన ఘటనను కూడా గవాస్కర్ తన కాలమ్‌లో ప్రస్తావించాడు. సన్‌రైజర్స్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి వ్యాఖ్యలను కూడా గవాస్కర్ తప్పుబట్టాడు. వెటోరి న్యూజిలాండ్‌కు చెందినవాడని, భారత-పాకిస్థాన్ మధ్య ఉన్న పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోకపోవచ్చని గవాస్కర్ అన్నాడు. అయితే భారతీయ యజమానులు మాత్రం పరిస్థితిని అర్థం చేసుకుని ఇలాంటి నిర్ణయాలను నివారించాల్సిన బాధ్యత ఉందని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.



# వీడియో గేమ్‌లా వైభవ్ సిక్సులు: సంజూ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ ప్రశంసల జల్లు కురిపించాడు. వైభవ్ సూర్యవంశీ వీడియో గేమ్‌లా క్రికెట్ ఆడుతున్నాడని కొనియాడాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో తమ కోచ్ రాహుల్ ద్రవిడ్ సర్‌కు చెప్పి మరీ ఫస్ట్ బాల్‌ను సిక్సర్ తరలించాడని సంజూ శాంసన్ గుర్తు చేసుకున్నాడు. న్యూఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన బీసీసీఐ నమాన్ అవార్డ్స్ కార్యక్రమంలో సంజూ శాంసన్ ఈ వివరాలను వెల్లడించాడు. హోస్ట్ హర్ష భోగ్లే.. వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రం గురించి మాట్లాడుతుండగా.. సంజూ జోక్యం చేసుకున్నాడు. వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు తమ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో జరిగిన సంభాషణను గుర్తు చేసుకున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌కు ముందు రాహుల్ ద్రవిడ్ సర్ తనను పిలిచాడని చెప్పిన సంజూ శాంసన్.. వైభవ్ చిన్న పిల్లాడని, అరంగేట్ర మ్యాచ్‌లో ఎలా ఆడాలో గైడెన్స్ ఇద్దామని చెప్పి అతన్ని పిలవమన్నారు. తమ రూమ్‌లోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీని.. ద్రవిడ్ సర్ రేపటి మ్యాచ్ ప్లాన్ ఏంటి? అని అడిగారు. దానికి వైభవ్ చాలా కూల్‌గా 'ఏం లేదు సార్.. నేను ఆడుతాను అంతే'అని బదులిచ్చాడు. మళ్లీ ద్రవిడ్ సర్ సర్ది చెబుతూ.. 'అలా కాదు వైభవ్.. నీ గేమ్ ప్లాన్ ఏంటి? నువ్వు ఎలా బ్యాటింగ్ చేద్దాం అనుకుంటున్నావు?'అని మళ్లీ అడిగారు. 'కాదు వైభవ్.. నీ గేమ్ ప్లాన్ ఏంటి? నువ్వు ఎలా బ్యాటింగ్ చేద్దాం అనుకుంటున్నావు?'అని మళ్లీ ప్రశ్నించారు. అప్పుడు వైభవ్ ఏమాత్రం తడుముకోకుండా.. 'ఒకవేళ మొదటి బంతి నా జోన్‌లోకి వస్తే సిక్సర్ కొడుతాను'అని బదులిచ్చాడు. వాడు చెప్పినట్టే ఫస్ట్ బాల్‌నే సిక్సర్ కొట్టాడని సంజూ శాంసన్ నవ్వుతూ చెప్పాడు.



## జితేశ్ శర్మ టీ20 కప్ ఆడకపోవడం

# బాధగా ఉంది: సూర్య


టీమిండియా యువ వికెట్ కీపర్ జితేష్ శర్మ ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఆడకపోవడం తనకు బాధగా ఉందని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. టీమ్‌కాంబినేషన్‌లో భాగంగా చివరి నిమిషంలో అతను ప్రపంచకప్ జట్టుకు దూరమయ్యాడని చెప్పాడు. జట్టుకు ఇషాన్ కిషన్ అవసరం ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరణ ఇచ్చాడు. మెగా టోర్నీకి ముందు జితేష్ శర్మ స్థానంలో సెలెక్టర్లు ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇషాన్ కిషన్ మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 9 మ్యాచ్‌ల్లో 317 పరుగులు చేసి సెలెక్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. 'ఇషాన్ కిషన్ సామర్థ్యాలను, అతను జట్టుకు తీసుకురాగల ప్రేరణను పరిగణలోకి తీసుకొని మేం ఈ నిర్ణయం తీసుకున్నాం. జితేష్ స్థానంలో ఇషాన్ కిషన్‌ను తీసుకోవాల్సి వచ్చినప్పుడు నేను కాస్త బాధపడ్డాను. ఎందుకంటే గతేడాదిన్నరగా జితేష్ శర్మ జట్టులో ఉన్నాడు. ఫినిషర్‌గా తన బాధ్యతను అద్భుతంగా నిర్వహించడంతో పాటు మెరుగైన ప్రదర్శన చేశాడు. నీ మాకు టాప్ ఆర్డర్‌లో ఒక 'ఎక్స్-ఫ్యాక్టర్', ఫియర్-లెస్ హిట్టర్ కావాలని అనిపించింది. ఇద్దరు ఉత్తమ వికెట్ కీపర్లలో ఒకర్ని ఎంచుకునేటప్పుడు.. ఒకరికి ఉద్వాసన తప్పదు. ఇషాన్ కిషన్ జట్టుకు ఎంపికైన వెంటనే నేను అతనికి ఫోన్ చేశాను. 'ఛోటూ, మనకు వరల్డ్ కప్ గెలిపిస్తావా?అని అడిగాను. దానికి ఇషాన్ ఏమాత్రం తడుముకోకుండా.. నన్ను నమ్ముతారా? అని తిరిగి ప్రశ్నించాడు. నేను 'నమ్ముతాను' అని చెప్పాను. ఆ నమ్మకాన్ని అతను నిజం చేశాడు. ఇషాన్ చాలా గడ్డు కాలాన్ని ఎదుర్కొన్నాడు. కానీ అతను ఏమాత్రం కుంగిపోకుండా దేశంలోని ప్రతి మూలకు వెళ్లి ప్రాక్టీస్ మ్యాచ్‌లు, డొమెస్టిక్ మ్యాచ్‌లు ఆడి తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. అతని అంకితభావం చూశాక అతనే సరైన ఎంపిక అని నాకు అనిపించింది'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.

# 'గ్రౌండ్' గట్టెక్కిన ఆర్సీబీ



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కు పెద్ద ఉపశమనం లభించింది. బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ స్టేడియంలోని భద్రత, సంసిద్ధత చర్యలను పరిశీలించి క్లీన్ చీట్ ఇచ్చింది. దాంతో కర్ణాటక ప్రభుత్వం మ్యాచ్‌లు నిర్వహించేందుకు అనుమతిచ్చింది. సోమవారం విధాన సౌధలో హోం మంత్రి జి పరమేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దాంతో ఆర్‌సీబీ హోమ్ మ్యాచ్‌లు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరగనున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్‌సీబీ.. చిన్నస్వామి స్టేడియంలో 5 మ్యాచ్‌లు ఆడనుంది. తన రెండో హోమ్ గ్రౌండ్‌గా రాయ్‌పుర్‌లోని షహీద్ వీర్ నారాయణ సింగ్ స్టేడియాన్ని ఎంచుకున్న ఆర్‌సీబీ.. అక్కడ రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. ఐపీఎల్‌లో ఒక ప్లే ఆఫ్ మ్యాచ్, ఫైనల్ కూడా బెంగళూరులో నిర్వహించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. గతేడాది ఆర్‌సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీరియస్ అయిన ప్రభుత్వం.. జస్టిస్ కున్హా సారథ్యంలోని కమిటీతో విచారణ జరిపించింది. ఆ కమిటీ సూచనల మేరకు కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో భద్రతా చర్యలు చేపట్టింది. తొక్కిసలాట వంటి ఘటనలు పునరావృతం కాకుండా చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా 35 వేల మంది ప్రేక్షకులకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. అలాగే చివరి నిమిషంలో రద్దీని నివారించడానికి మ్యాచ్‌కు ముందు 3, 4 గంటల ముందే స్టేడియం గేట్లను తెరవనున్నారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో టికెట్ కలిగి ఉన్న ప్రేక్షకులకు మెట్రోలో ఉచిత ప్రయాణ వసతి కల్పించనున్నారు.

# 2027 వరల్డ్ కప్ మా లక్ష్యం: గిల్



ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027 గెలవడమే తమ తదుపరి లక్ష్యమని టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచినప్పటికీ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి తృటిలో కప్‌ను చేజార్చుకుంది. న్యూఢిల్లీ వేదికగా ఆదివారం జరిగిన బీసీసీఐ నమన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న శుభ్‌మన్ గిల్.. తమ తదుపరి లక్ష్యం గురించి వెల్లడించాడు. 'వన్డే ప్రపంచకప్ గెలవడం మా తదుపరి లక్ష్యం. గత ఫైనల్లోనే మేం తృటిలో టైటిల్ కోల్పోయాం. సౌతాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027 మాకు మరో అవకాశం. ఏ ఫార్మాట్‌లోనైనా దేశం కోసం ప్రపంచకప్‌ను గెలవడం మా ప్రధాన లక్ష్యం. ఈ ఆలోచన ఎప్పుడూ నా మనసులో తిరుగుతూనే ఉ ంటుంది.'అని శుభ్‌మన్ గిల్ పేర్కొన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
మంగళవారం 17-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# సుప్రీం 'కారుణ్యం'

కారుణ్య మరణం వంటి అంశాలపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పులు కేవలం చట్టపరమైనవి కాకుండా, లోతైన మానవీయ విలువలను ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా హరీష్ రాణా (2026), అరుణా షాన్‌బాగ్ (2011) వంటి కేసుల్లో న్యాయస్థానం అనుసరించిన వైఖరి ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం జీవించే హక్కులో గౌరవప్రదంగా మరణించే హక్కు కూడా అంతర్భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కృత్రిమ శ్వాసతో, కోలుకునే అవకాశం లేని స్థితిలో జీవచ్ఛవంలా బతకడం కంటే, ప్రశాంతంగా తనువు చాలించడం మిన్న అనే మానవీయ దృక్పథాన్ని కోర్టు సమర్థించింది. దాదాపు 13 ఏళ్లుగా అపస్మారక స్థితిలో ఉన్న హరీష్ రాణా కేసులో తీర్పునిస్తూ, అదనపు కాలం బాధను పొడిగించడం కంటే ఆ వేదన నుంచి విముక్తి కల్పించడమే సరైనదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఈ తీర్పు చదివే సమయంలో న్యాయమూర్తులు భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకోవడం ఈ అంశం వెనుక ఉన్న మానవీయతకు నిదర్శనం. రోగిని బతికించుకోవడానికి ఏళ్ల తరబడి కుటుంబ సభ్యులు పడే వేదనను, వారి ఆర్థిక స్థితిగతులను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంటుంది.

హరీష్ రాణా తల్లిదండ్రులు దశాబ్ద కాలంపైగా చేసిన నిస్వార్థ సేవను కోర్టు ప్రశంసించింది. ఒక వ్యక్తి తనకు కోలుకోలేని స్థితి వస్తే చికిత్సను నిలిపివేయాలని ముందుగానే రాసిచ్చే 'లివింగ్ విల్'ను చట్టబద్ధం చేయడం ద్వారా, వ్యక్తిగత నిర్ణయాలకు కోర్టు విలువిచ్చింది. మానవీయ కోణంతో పాటు, ఈ వెసులుబాటు దుర్వినియోగం కాకుండా మెడికల్ బోర్డుల పర్యవేక్షణ వంటి కఠిన నిబంధనలను సుప్రీంకోర్టు విధించింది. చట్టం శిక్షించడానికి మాత్రమే కాకుండా, మనిషి బాధను అర్థం చేసుకునేదిగా ఉండాలని ఈ తీర్పులు నిరూపిస్తున్నాయి. కారుణ్య మరణంపై సుప్రీంకోర్టు తీర్పులు ప్రాణం పోయడం దైవేచ్ఛ అయితే, ఆ ప్రాణాన్ని అనవసర వేదన నుంచి కాపాడటం మానవీయత అనే సూత్రంపై ఆధారపడి ఉన్నాయి.

# టీచర్లు.. ఈవెంట్ మేనేజర్లు!?

**నేటి భారతదేశ విద్యా వ్యవస్థలో ఒక నిశ్శబ్దమైన కానీ తీవ్ర ఆందోళన కలిగించే పరిణామం చోటుచేసుకుంటోంది. ఈ పరిణామం బయటికి పెద్దగా కనిపించకపోయినా, విద్య గుండెకాయను తాకుతోంది. అది ఉపాధ్యాయుడి మనసులో జరుగుతున్న మార్పు. ఒకప్పుడు విద్యకు ప్రాణంగా నిలిచిన ఉపాధ్యాయుడు నేడు అలసట, నిరాశ, నిస్సహాయత భావాలతో నిండిపోతున్నాడు. కొందరు ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను నిశ్శబ్దంగా వదిలివేస్తున్నారు. ఇంకొందరు శారీరకంగా తరగతి గదిలో ఉన్నప్పటికీ మానసికంగా దూరంగా వెళ్తున్నారు. అదే సమయంలో కొత్త తరం ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించడానికి ముందుకు రావడం తగ్గుతోంది. ఈ పరిణామం ఒక వ్యక్తి సమస్య కాదు; ఇది సమాజ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

విద్యలో ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదు. అతను విలువలను పంచే మార్గదర్శి. పిల్లలలో ఆలోచనాశక్తిని పెంపొందించే మార్గనిర్దేశకుడు. అయితే నేటి పరిస్థితుల్లో ఉపాధ్యాయుడు తన అసలు పాత్రను పోగొట్టుకుంటున్నాడు. దీనికి ప్రధాన కారణాలలో ఒకటి బ్యూరోక్రటిక్ వ్యవస్థ. పాఠశాలల్లో ఉపాధ్యాయులపై పడుతున్న పరిపాలనా భారం రోజు రోజుకు పెరుగుతోంది. ఒకప్పుడు ఉపాధ్యాయుడు ఎక్కువ సమయం తరగతి గదిలో గడిపేవాడు. ఇప్పుడు మాత్రం కంప్యూటర్ ముందు కూర్చుని డేటా నమోదు చేయడం, నివేదికలు పంపించడం, ఫోటోలు అప్‌లోడ్ చేయడం వంటి పనుల్లో ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోంది. ప్రతి కార్యక్రమానికి సాక్ష్యం చూపాల్సిన పరిస్థితి ఏర్పడింది. "ఫోటో పంపండి", "నివేదిక అప్‌లోడ్ చేయండి", "డేటా నమోదు చేయండి" అనే ఆదేశాలు ఉపాధ్యాయుల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ పరిస్థితిలో బోధన అనే ప్రధాన బాధ్యతకు సమయం తగ్గిపోతుంది. ఇంకొక ముఖ్యమైన అంశం టెక్నాలజీపై అతిగా ఆధారపడటం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యకు ఉపయోగకరమైన సాధనం కావచ్చు. కానీ అది లక్ష్యంగా మారినప్పుడు సమస్యలు ప్రారంభమవుతాయి. నేటి పాఠశాలల్లో డిజిటల్ సాధనాలు, యాప్‌లు, స్మార్ట్ బోర్డులు విస్తృతంగా ప్రవేశించాయి. సబ్జెక్టు స్వభావం ఏమిటి, పిల్లల వయస్సు ఎంత, వారి సామాజిక పరిస్థితి ఎలా ఉంది అనే విషయాలను పరిగణలోకి తీసుకోకుండా "టెక్నాలజీ ఉపయోగించాలి" అనే ఆదేశాలు వస్తున్నాయి. ఈ ప్రక్రియలో విద్య మానవ స్పర్శ నెమ్మదిగా తగ్గిపోతోంది. ఉపాధ్యాయుడు -- విద్యార్థి మధ్య ఉండే ప్రత్యక్ష సంబంధం యంత్రాల మధ్య చిక్కుకుపోతుంది. విద్య ఒక జీవంతమైన ప్రక్రియగా ఉండాలి. కానీ అది క్రమంగా యంత్ర కేంద్రీకృత ప్రక్రియగా మారుతోంది.

ఇటీవలి కాలంలో ఉపాధ్యాయులు మరొక కొత్త పాత్రను కూడా నిర్వహించాల్సి వస్తోంది. అది ఈవెంట్ మేనేజర్ పాత్ర. ప్రతి రోజు ఒక ప్రత్యేక దినోత్సవం జరుపుకోవాలి. యోగా దినోత్సవం, పర్యావరణ దినోత్సవం, మాతృభాషా దినోత్సవం, ఆరోగ్య దినోత్సవం వంటి అనేక కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాల వెనుక ఉన్న ఉద్దేశం మంచి అయినప్పటికీ అమలు విధానం ఉపాధ్యాయులపై అదనపు భారం మోపుతోంది. విద్య నాణ్యతను పెంచడం కంటే కార్యక్రమాల సంఖ్య పెంచడం ముఖ్యమవుతోంది. ఫోటోలు తీయడం, నివేదికలు పంపడం, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి పనులు ఉపాధ్యాయుల సమయాన్ని ఆక్రమిస్తున్నాయి. ఈ విధంగా ఉపాధ్యాయుడు క్రమంగా బోధకుడి పాత్ర నుండి కార్యక్రమ నిర్వాహకుడి పాత్రలోకి నెట్టబడుతున్నాడు. ఈ పరిస్థితులు ఉపాధ్యాయులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. నిరంతర పర్యవేక్షణ, నిరంతర మూల్యాంకనం ఉపాధ్యాయుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ప్రతి పనికి ఆధారాలు ఇవ్వాల్సిన పరిస్థితి నమ్మకాన్ని తగ్గిస్తోంది. ఉపాధ్యాయుడి వృత్తి ఒకప్పుడు గౌరవప్రదమైనది. సమాజంలో అతనికి ప్రత్యేక స్థానం ఉండేది. ఇప్పుడు ఆ గౌరవం క్రమంగా తగ్గిపోతున్నట్లు అనిపిస్తోంది. విద్యార్థుల ప్రవర్తనా సమస్యలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రుల అంచనాలు అసాధ్యమైన స్థాయికి చేరుతున్నాయి. ఈ రెండు ఒత్తిడుల మధ్య ఉపాధ్యాయుడు మానసికంగా కుంగిపోతున్నాడు. విద్య అసలు ఉద్దేశ్యం కూడా క్రమంగా మసకబారుతోంది. ఒకప్పుడు పాఠశాలలు మానవ అభివృద్ధి కేంద్రాలుగా భావించబడేవి. అక్కడ పిల్లలు కేవలం పాఠాలు నేర్చుకునే వారు కాదు; జీవిత విలువలను గ్రహించే వారు. ఇప్పుడు మాత్రం "సిలబస్ పూర్తి చేయాలి" అనే ఒత్తిడి పెరిగింది. సబ్జెక్టుల సంఖ్య కూడా అనవసరంగా పెరుగుతోంది. ఫలితంగా విద్యార్థులు కూడా ఒత్తిడికి గురవుతున్నారు. ఉపాధ్యాయులు కూడా అదే ఒత్తిడిని అనుభవిస్తున్నారు. విద్య ఒక ప్రదర్శన ప్రాజెక్ట్‌లా మారిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. పాఠశాలలు తమ విజయాన్ని కార్యక్రమాల సంఖ్యతో కొలుస్తున్నాయి. ఈ మార్పుల మధ్య ఒక ముఖ్యమైన అంశం కనిపించకుండా పోతోంది. అది ఉపాధ్యాయుడు -- విద్యార్థి సంబంధం. విద్యలో అత్యంత కీలకమైన ఈ సంబంధం ఇప్పుడు డేటా, నివేదికలు, గడువుల మధ్య దాగిపోతోంది. ఒకప్పుడు ఉపాధ్యాయుడు విద్యార్థికి మార్గదర్శి. అతను విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసే వ్యక్తి. ఇప్పుడు మాత్రం విద్యార్థులు ఉపాధ్యాయులను సేవా ప్రదాతలుగా చూడటం ప్రారంభించారు. ఈ దృక్పథం విద్యలో గౌరవాన్ని తగ్గిస్తుంది. గౌరవం తగ్గినప్పుడు విద్య ఆత్మ కూడా బలహీనపడుతుంది. ఈ పరిస్థితులను గమనించినప్పుడు ఒక ముఖ్యమైన ప్రశ్న ముందుకు వస్తుంది. విద్య అసలు కేంద్రం ఏమిటి? పాఠశాలల భవనాలు, సాంకేతిక సాధనాలు, నివేదికలు, గణాంకాలు -- ఇవన్నీ అవసరమైనవి కావచ్చు. కానీ ఇవి విద్య గుండెకాయ కావు. విద్య అసలు కేంద్రం పిల్లలు. ఆ పిల్లల అభివృద్ధికి మార్గదర్శకుడిగా నిలిచే ఉపాధ్యాయుడు. ఈ రెండు అంశాలు లేకుండా విద్య వ్యవస్థ నిలబడలేదు.

అందుకే ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉపాధ్యాయుడికి మళ్లీ స్వేచ్ఛ ఇవ్వాలి. అతని వృత్తిపరమైన నిర్ణయాలను గౌరవించాలి. అతనిపై నమ్మకం ఉంచాలి. అతని పని బోధన. ఆ పనిని సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలి. పరిపాలనా భారం తగ్గించాలి. అవసరం లేని కార్యక్రమాల ఒత్తిడిని తగ్గించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని సహాయక సాధనంగా ఉపయోగించాలి గానీ ప్రత్యామ్నాయంగా చూడకూడదు. ఉపాధ్యాయుడు ఒక సాధారణ ఉద్యోగి కాదు. అతను సమాజ భవిష్యత్తును నిర్మించే శిల్పి. అతని చేతుల్లోనే రేపటి పౌరులు రూపుదిద్దుకుంటారు. అందువల్ల ఉపాధ్యాయుడి మనసులో విశ్వాసం నిలవాలి. అతని వృత్తిలో గౌరవం ఉండాలి. అతని పని విలువైనదిగా గుర్తించాలి. ఒక ఉపాధ్యాయుడు వెళ్లిపోతే ఒక పాఠశాల కొనసాగవచ్చు. మరొకరిని నియమించవచ్చు. కానీ ఉపాధ్యాయులపై విశ్వాసం కోల్పోయిన విద్యా వ్యవస్థ ఎక్కువకాలం నిలబడదు. విద్య ప్రాణం ఉపాధ్యాయుడు. అతను నిలబడినప్పుడే విద్య నిలబడుతుంది. అందుకే ఇప్పుడు అత్యవసరమైన పని ఉపాధ్యాయులపై విశ్వాసాన్ని తిరిగి రగిలించడం. వారికి గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. వారి వృత్తికి అర్థాన్ని తిరిగి అందించడం. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు వెళ్లిపోవడం అనేది కేవలం ఒక ఉద్యోగం ఖాళీ కావడం కాదు; అది విద్య ఆత్మ కొంత కోల్పోవడం. ఈ వాస్తవాన్ని సమాజం గమనించాలి. విద్యా విధానాలు రూపొందించే వారు గమనించాలి. పాఠశాలలు గమనించాలి. ఉపాధ్యాయుడు అనే పదం భారతీయ సంస్కృతిలో ఒక సాధారణ వృత్తి గుర్తింపుకాదు; అది ఒక విలువ, ఒక బాధ్యత, ఒక ఆధ్యాత్మిక స్థానం. గురువు అనే భావన శతాబ్దాలుగా జ్ఞానం, నీతి, మార్గదర్శకత్వం అనే మూడు ప్రధాన మూల్యాల సమ్మేళనంగా భావించబడింది. ఒక సమాజం తన గురువులను ఎలా గౌరవిస్తుంది అనేది ఆ సమాజ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన ప్రమాణంగా పరిగణించబడింది. అయితే నేటి విద్యా వ్యవస్థలో జరుగుతున్న మార్పులను గమనిస్తే ఉపాధ్యాయుడి పాత్ర క్రమంగా అంచులకు నెట్టబడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితి కేవలం ఉపాధ్యాయుడి వ్యక్తిగత సమస్యగా చూడలేం; ఇది మొత్తం విద్యా వ్యవస్థకు సంబంధించిన సంక్షోభం.



ఇటీవలి కాలంలో విద్యను కొలిచే ప్రమాణాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు విద్యార్థి ఆలోచనా శక్తి, సృజనాత్మకత, విలువలు వంటి అంశాలను ముఖ్యంగా పరిగణించేవారు. ఇప్పుడు మాత్రం విద్యా విజయాన్ని గణాంకాలు, డేటా పట్టికలు, నివేదికల ఆధారంగా కొలవడం ప్రారంభమైంది. పాఠశాలలు తమ పనితీరును నిరూపించుకోవడానికి అనేక రకాల పత్రాలు సిద్ధం చేయాల్సి వస్తోంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుడి సమయం పెద్ద మొత్తంలో పరిపాలనా పనుల్లో నిమగ్నమవుతోంది. బోధనకు అవసరమైన సమయం క్రమంగా తగ్గిపోతోంది. విద్య అసలు ఉద్దేశ్యం అయిన ఆలోచనను ప్రేరేపించడం అనే లక్ష్యం అంచులకు చేరుతోంది. విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశం ఒక గొప్ప అవకాశంగా ప్రారంభమైంది. సరైన విధంగా వినియోగిస్తే అది విద్యార్థుల అభ్యాసాన్ని మరింత సమృద్ధిగా చేయగలదు. కానీ సాంకేతిక సాధనాలను లక్ష్యంగా మార్చినప్పుడు సమస్యలు ప్రారంభమవుతాయి. నేటి పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఒక సహాయక సాధనం కాకుండా ఒక నియంత్రణ వ్యవస్థగా మారుతోంది. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఎలా బోధించాలి అనే విషయాన్ని కూడా యంత్రాల ద్వారా నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విధానం ఉపాధ్యాయుడి సృజనాత్మకతను తగ్గిస్తుంది. అతని అనుభవాన్ని కూడా విలువ తగ్గిస్తుంది. పాఠశాలల్లో కార్యక్రమాల సంస్కృతి కూడా పెరుగుతోంది. ప్రతి రోజు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం అనేది విద్యార్థుల్లో అవగాహన పెంచడానికి ఉపయోగపడవచ్చు. కానీ అదే కార్యక్రమాలు అధికమై ఉపాధ్యాయుల ప్రధాన పనిని దెబ్బతీస్తే అది సమస్యగా మారుతుంది. పాఠశాలలు తమ విజయాన్ని విద్యార్థుల లోతైన అభ్యాసంతో కాకుండా కార్యక్రమాల సంఖ్యతో కొలవడం ప్రారంభించిన పుడు విద్య నాణ్యత తగ్గిపోతుంది. ఈ పరిస్థితి ఉపాధ్యాయులను అసలు బోధకులుగా కాకుండా కార్యక్రమ నిర్వాహకులుగా మార్చేస్తోంది. మరో ముఖ్యమైన అంశం ఉపాధ్యాయులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి. నిరంతర పర్యవేక్షణ, నిరంతర నివేదికల అవసరం, తల్లిదండ్రుల అధిక అంచనాలు, విద్యార్థుల ప్రవర్తనా సమస్యలు --- ఇవన్నీ కలిసి ఉపాధ్యాయుల మనసులో అలసటను పెంచుతున్నాయి. ఒకప్పుడు ఉపాధ్యాయుడు సమాజంలో గౌరవనీయమైన వ్యక్తిగా భావించబడేవాడు. ఇప్పుడు ఆ గౌరవం క్రమంగా తగ్గిపోతున్నట్లు అనిపిస్తోంది. ఈ పరిస్థితి ఉపాధ్యాయుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. వారి వృత్తిపట్ల ఉన్న ఆసక్తిని కూడా తగ్గిస్తుంది.

ఈ మార్పుల మధ్య ఒక ముఖ్యమైన సత్యం మనం మరచిపోకూడదు. విద్య అసలు కేంద్రం భవనాలు కాదు. సాంకేతిక పరికరాలు కాదు. గణాంకాలు కాదు. విద్య అసలు కేంద్రం పిల్లలు. ఆ పిల్లలకు మార్గదర్శకుడిగా నిలిచే ఉపాధ్యాయుడు. ఈ రెండు అంశాలు లేకుండా విద్యా వ్యవస్థకు జీవం ఉండదు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చగలడు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థిలో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయగలడు. ఒక మంచి ఉపాధ్యాయుడు సమాజానికి బాధ్యత గల పౌరుడిని తయారు చేయగలడు. అందువల్ల ఉపాధ్యాయుడికి అవసరమైన గౌరవం తిరిగి ఇవ్వడం అత్యవసరం. అతనిపై నమ్మకం ఉంచడం కూడా అంతే ముఖ్యమైనది. పరిపాలనా వ్యవస్థ ఉపాధ్యాయుడిని నియంత్రించడానికి కాకుండా సహకరించడానికి ఉండాలి. అతని సమయాన్ని పరిరక్షించాలి. అతని బోధనా స్వేచ్ఛను గౌరవించాలి. అతని అనుభవాన్ని గుర్తించాలి. అతని వృత్తిపట్ల గౌరవాన్ని సమాజం మొత్తం కలిగి ఉండాలి. విద్యా విధానాలను రూపొందించే వారు కూడా ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. పాఠ్యపుస్తకాలు, పరీక్షా విధానాలు, సాంకేతిక పరికరాలు --- ఇవన్నీ అవసరమైనవి. కానీ ఇవి ఉపాధ్యాయుడిని ప్రత్యామ్నాయంగా భర్తీ చేయలేవు. ఒక ఉపాధ్యాయుడు మాత్రమే విద్యార్థితో మానవ సంబంధాన్ని ఏర్పరచగలడు. ఆ సంబంధమే విద్యను జీవంతంగా ఉంచుతుంది. ఆ సంబంధమే విద్యార్థిలో జ్ఞానం పట్ల ఆసక్తిని కలిగిస్తుంది. ఉపాధ్యాయ వృత్తిలోకి కొత్త తరం రావాలంటే ఈ వృత్తికి గౌరవం ఉండాలి. భద్రత ఉండాలి. సృజనాత్మకతకు అవకాశాలు ఉండాలి. ఒక యువకుడు ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునేటప్పుడు గర్వంగా భావించే పరిస్థితి ఉండాలి. అప్పుడు మాత్రమే భవిష్యత్తులో మంచి ఉపాధ్యాయులు పెరుగుతారు. మంచి ఉపాధ్యాయులు పెరిగితేనే మంచి విద్యా వ్యవస్థ ఏర్పడుతుంది. చివరగా ఒక గొప్ప సత్యాన్ని గుర్తించాలి. ఒక ఉపాధ్యాయుడు వెళ్లిపోతే ఒక పాఠశాల మాత్రం కొనసాగవచ్చు. కానీ ఉపాధ్యాయులపై విశ్వాసం కోల్పోయిన విద్యా వ్యవస్థ నిలబడదు. ఎందుకంటే విద్య ఆత్మ ఉపాధ్యాయుడిలో ఉంటుంది.

అతని ఆలోచనలో ఉంటుంది. అతని మార్గదర్శకత్వంలో ఉంటుంది. అతను లేకపోతే విద్య కేవలం ఒక పరిపాలనా ప్రక్రియగా మిగిలిపోతుంది. అందుకే నేటి సమాజం ముందున్న అత్యంత ముఖ్యమైన బాధ్యత ఉపాధ్యాయులపై విశ్వాసాన్ని తిరిగి రగిలించడం. వారి వృత్తికి గౌరవాన్ని తిరిగి ఇవ్వడం. వారి పాత్రను సమాజ నిర్మాణంలో కేంద్రస్థానంలో నిలపడం. ఇది జరిగితేనే రేపటి విద్య జీవంతో నిండుతుంది. అది జరిగితేనే విద్యార్థుల భవిష్యత్తు ప్రకాశవంతమవుతుంది. అదే సమాజ అభివృద్ధికి నిజమైన మార్గం అవుతుంది. ఉపాధ్యాయుడు నిలబడితే విద్య నిలబడుతుంది. విద్య నిలబడితే సమాజం నిలబడుతుంది. ఇదే ఈ సమస్య మనకు అందించే గొప్ప పాఠం.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.